



ESTD: 1999
www.voodayam.com

# వుదయం

కరీంనగర్ 27-04-2026 సోమవారం | సంపుటి : 14 | సంచిక :138
SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 4.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal
Follow us on






# ట్రంప్‌పై హత్యాయత్నం

## శనివారం రాత్రి వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ వద్ద పలుమార్లు కాల్పులు • కాపాడిన సీక్రెట్ సర్వీస్

ఐదు నుంచి ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిపిన

31 యేళ్ల అలెన్‌గా దుండగుని గుర్తింపు

డెమొక్రాటిక్ పార్టీ సానుభూతి పరుడని వెల్లడి

బాగా చదువుకున్న అలెన్ కమలాహారిస్ అధ్యక్ష ప్రచారానికి

25 దాలర్లు విరాళం ఇచ్చినట్టు ఎలక్షన్ కమిషన్ రికార్డుల్లో సమాచారం

ట్రంప్, మెలానియా ట్రంప్, జెడి వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్,

మార్కో రుబియోలను సంఘటనా స్థలం నుంచి హుటాహుటిన

తరలింపు, ట్రంప్ క్షేమంగా ఉన్నారని ఊరట చెందాను,

ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు : ప్రధాని మోడీ



**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :** శనివారం రాత్రి వైట్ హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ వద్ద గందరగోళం నెలకొంది. బ్యాంకెట్ హాల్‌లో పలుమార్లు కాల్పులు జరగడంతో ఆయనపై మరో హత్యాయత్నం జరుగుతుందనే భయంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆ ప్రాంగణం నుండి సురక్షితంగా తరలించారు. కాల్పుల ఘటన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాతోపాటు ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియోను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు. సీక్రెట్ సర్వీస్, ఇతర భద్రత అధికారులు బ్యాంకెట్ హాల్‌లోకి ప్రవేశించడంతో వందలాది మంది అతిథులు ప్రాణభయంతో టేబుళ్ల కింద దాక్కున్నారు. ఐదు నుంచి ఎనిమిది రౌండ్ల కాల్పుల శబ్దాలు వినిపించినట్లు అక్కడున్నవారు తెలిపారు. బ్యాంకెట్ హాల్ వెలుపల భద్రత కట్టుదిట్టం చేశారు. కాల్పుల ఘటన అనంతరం అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, అధికారులు అద్భుతంగా పనిచేశారని కొనియాడారు. క్షణాల్లోనే ఎంతో వేగంగా, ధైర్యంగా ప్రతిస్పందించినట్లు తెలిపారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పట్టుకున్నట్లు వెల్లడించారు. వెంటనే అక్కడి నుంచి తనతో పాటు మెలానియా, జేడీవాన్స్, క్యాబినెట్ సభ్యులందరినీ తరలించినట్లు తెలిపారు. తామంతా సురక్షితంగా ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు.

### ట్రంప్‌పై కాల్పులు జరిపిన అలెన్ ఎవరు?



వైట్‌హౌజ్ కరెస్పాండెంట్ల డిన్నర్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పులు జరిపేందుకు యత్నించిన నిందితుడి గుర్తింపును అధికారులు మిగతా 2లో

### ప్రధాని మోడీ స్పందన

వాషింగ్టన్ డీసీలోని ఒక హోటల్‌లో ఇటీవల జరిగిన కాల్పుల ఘటన తర్వాత అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ, ఉపాధ్యక్షుడు క్షేమంగా ఉన్నారని తెలిసి ఊరట చెందాను. వారి భద్రత, క్షేమం కొనసాగాలని నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదు, దానిని నిస్సందేహంగా ఖండించాలి అని మోడీ ఎక్స్‌పై చేసిన పోస్టులో పేర్కొన్నారు.



## స్వీయ జనగణనలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఎఎంఎస్) :** ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆదివారం నాడు జనగణన మొదటి ఘట్టం మొదటి రోజునా సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వీయ గణన) లో పాల్గొని తన సొంత వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక ఆల, సమాచార పౌర సంబంధాల కమిషనర్ సీహెచ్. ప్రియాంకతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రీగన్ నుంచి ట్రంప్ వరకు

అధ్యక్షులపై కాల్పుల వేదికగా హిల్టన్ హోటల్ 2



# ప్రజల వద్దకు ప్రజా వాణి

## మండలాల వరకు క్షేత్రస్థాయికి విస్తరించాలి

ప్రజలకు మరింత చేరువ చేయాలి

వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో

ప్రజావాణి ప్రారంభించాలి

తరువాత మండల స్థాయికి తీసుకెళ్లాలి

ప్రజలు చేసే ప్రతి ఫిర్యాదును నమోదుచేసి

ఆయా విభాగాలకు పంపించాలి

పరిష్కార కృషి ఏస్థాయిలో ఉందో

అర్జీదారులకు తెలియజేయాలి

ఫిర్యాదులు సమాచారం తెలుసుకోడానికి

డిజిట్ ప్లాట్ ఫామ్ అభివృద్ధి చేయాలి

అన్నిస్థాయిల్లో నోడల్ అధికారులను

నియమించాలి : సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజునే (2023 డిసెంబర్ 8వ తేదీన) ప్రారంభించిన ప్రజావాణిని క్రమక్రమంగా మండల స్థాయికి తీసుకువెళ్లి ప్రజలకు అతిచేరువ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ఇప్పటి వరకు జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిరాటంకంగా సాగుతున్నది. దీనినే ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. ముందు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రారంభించాలి. ఆ తరువాత మండల స్థాయిలో మొదలు పెట్టాలి అని ముఖ్యమంత్రి ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం కార్యాలయంలో ఆదివారం నాడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ వాణిని వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజావాణికి వచ్చి ప్రజలు ఇచ్చే ఫిర్యాదులన్నింటి మీద తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు వాటిని పంపించాలని అక్కడి నుంచి వచ్చే స్పందనను ఆ ఫిర్యాదు ఏ స్థాయిలో ఉన్నదో అర్జీదారులకు తెలియజేయాలని ఈ మొత్తం కార్యక్రమంలో ఎటువంటి రాజీఉండరాదని, అవినీతికి చోటు ఉండరాదని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం జరుగుతే అందుకు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలిచ్చే ఫిర్యాదులను నమోదు చేసి పరిష్కార దశ వరకు ట్రాకింగ్ చేయడానికి ఒక ఏకీకృత డిజిటల్ ప్లాట్ ఫామ్ ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన తృణమూల్

## పశ్చిమ బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ



**కోల్‌కత, ఏప్రిల్ 26 (వుదయం) :** పశ్చిమ బెంగాల్ ఎన్నికల రెండో దశ పోలింగ్‌కు ముందు, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని ఆరోపిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆ పార్టీపై తన దాడిని తీవ్రతరం చేశారు. ఆదివారం ఉత్తర 24 పరగణాలలో జరిగిన ఒక ర్యాలీలో ప్రసంగించిన ఆయన, ఉపాధ్యాయ నియామకాల కేసు, పంచాయతీ ఎన్నికలు, సందేశ్‌ఖాలి వివాదం వంటి సంఘటనలలో కోర్టు జోక్యాన్ని ఉటంకిస్తూ, పాలన, శాంతిభద్రతల సమస్యలపై అధికార పార్టీని విమర్శించారు. టిఎంసి ప్రభుత్వం తన గత నినాదమైన మా, మాటి, మానుష్‌ను (అమ్మ, భూమి, మనిషి) నిలబెట్టుకోవడంలో విఫలమైందని కూడా ఆయన ఆరోపించారు. "మా ఏడుస్తోంది, మాటి చొరబాటుదారుల చేతుల్లో ఉంది, మనుషులు భయంతో వణికిపోతున్నారు అని ప్రధానమంత్రి విమర్శించారు.

**మహిళలపై నేరాల విషయంలో టిఎంసిపై విమర్శలు**

2011లో రాష్ట్రంలో టిఎంసి అధికారంలోకి వచ్చినప్పటి నుండి బెంగాల్‌లో మహిళలపై జరిగిన దాడులను కూడా ప్రధాని ప్రస్తావించారు. కోల్‌కతాలోని ఆర్‌జి కార్ ఆసుపత్రిలో ఒక యువ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను, అలాగే కామ్‌దునిలో ఒక 20 ఏళ్ల యువతి హత్యను ఉదాహరణలుగా చూపుతూ, మహిళల భద్రతను కల్పించడంలో టిఎంసి ప్రభుత్వం విఫలమైందని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారతలో అగ్రగామిగా ఉన్న బెంగాల్‌ను తృణమూల్ పార్టీ అధమ స్థాయికి తీసుకువచ్చింది. ప్రతిరోజూ అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలు, హత్యల వార్తలు వస్తున్నాయి. మిగతా 2లో

## అధిష్టానం నిర్ణయాన్ని

# శిరసావహిస్తా

### కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్



**బెంగళూరు, ఏప్రిల్ 26 (వుదయం) :** రాష్ట్ర నాయకత్వానికి సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయాన్నైనా తాను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గౌరవించి పాటిస్తామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఆదివారం స్పష్టం చేశారు. న్యూఢిల్లీ పర్యటన ముగించుకుని బెంగళూరుకు తిరిగి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే విషయంలో పార్టీ కేంద్ర నాయకత్వంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. మే 4వ తేదీ తర్వాత నాయకత్వ మార్పు లేదా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఈ తేదీన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన ఎన్నికల ఫలితాలు, అలాగే కర్ణాటకలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. జాతీయ రాజధానిలో ఇటీవల రెండు రోజుల పాటు పర్యటించినప్పటికీ, అధిష్టానంతో తాను జరిపిన చర్చల వివరాల గురించి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్ మౌనం వహించారు. నేను మీడియా ముందు రాజకీయ అంశాల గురించి మాట్లాడను. సమయం వచ్చినప్పుడు మీకు ఆ విషయాలు తెలుస్తాయని నేను ఇప్పటికే చెప్పాను. కాబట్టి, నేను ఇప్పుడు మీకు ఏమీ చెప్పను, అని ఆయన అన్నారు. పార్టీలో అంతర్గత విభేదాల గురించి సీనియర్ మంత్రి సతీష్ జార్కిహోలి చేసినట్లుగా వచ్చిన వార్తలపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, పార్టీ ఐక్యంగానే ఉందని శివకుమార్ పునరుద్ఘాటించారు. అలాంటిదేమీ లేదు, వారు (హైకమాండ్) సరైన సమయంలో చేయాల్సింది చేస్తారు, అని ఆయన స్పష్టం చేశారు. గతంలో తీసుకున్న నిర్ణయాలన్నీ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతాయని కూడా ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో మూడేళ్ల మైలురాయిని సమీపిస్తున్న తరుణంలో, 2023లో ప్రభుత్వం ఏర్పాటు సమయంలో కుదిరినట్లు చెబుతున్న అధికార భాగస్వామ్య ఒప్పందం ఆధారంగా, ముఖ్యమంత్రి మార్పుపై వదంతులు తీవ్రమయ్యాయి. ఈ వదంతులపై స్పందిస్తూ, నేను ఈ అంశంపై ఎప్పుడూ చర్చించలేదు. హైకమాండ్ ఎప్పుడు, ఎటువంటి నిర్ణయం తీసుకున్నా తాము దాన్ని అంగీకరిస్తామని, దానికి కట్టుబడి ఉంటామని మిగతా 2లో



# హొర్ముజ్ మూతతో ఆకలి మంటలు



## ఎరువుల సరఫరాకు అంతరాయాలు ఏర్పడి లక్షలాది మందిని కరువు కోరల్లోకి నెట్టివేయవచ్చునని ఐక్యరాజ్య సమితి హెచ్చరిక

**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :** హొర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా ఎరువుల సరఫరాకు ఏర్పడే అంతరాయాలు ప్రపంచవ్యాప్త మానవతా సంక్షోభానికి దారితీసి, లక్షలాది మందిని ఆకలి, కరువు వైపు నెట్టవచ్చని ఐక్యరాజ్యసమితి ప్రాజెక్ట్ సేవల కార్యాలయం హెచ్చరించింది. ఈ హెచ్చరికను కార్యనిర్వాహక డైరెక్టర్ జార్జ్ మోరీరా డా సిల్వా జారీ చేశారు. పెరుగుతున్న ముడి పదార్థాల ధరలు, పరిమితమైన సముద్ర మార్గాలు ఇప్పటికే ప్రపంచ ఆహార వ్యవస్థలపై ఒత్తిడిని పెంచుతున్నాయని ఆయన అన్నారు. సరఫరా లంకెలను పునరుద్ధరించడానికి, సంక్షోభం మరింత తీవ్రతరం కాకుండా నిరోధించడానికి తక్షణ దౌత్య జోక్యం అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

**ఆందోళన రేకెత్తిస్తున్న ఎరువుల సరఫరాలో అంతరాయాలు**

కీలకమైన నౌకా రవాణా మార్గాలు నిరంతరం దిగ్బంధంలో ఉండటం వల్ల, ఎరువుల తయారీకి అయ్యే ఖర్చులు రికార్డు స్థాయికి చేరాయని, దిగుమతులపై ఆధారపడిన దేశాల్లో వ్యవసాయ ఉత్పత్తికి ఇది ముప్పు కలిగిస్తోందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.



ఎరువుల లభ్యత తగ్గడం వల్ల, ముఖ్యంగా ఇప్పటికే ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న బలహీన ప్రాంతాలలో పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోవచ్చని ఆ సంస్థ హెచ్చరించింది. ఐక్యరాజ్యసమితి ప్రకారం, ఈ సంక్షోభం రవాణా రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఆహార ఉత్పత్తి, ధరలపై దీర్ఘకాలిక ప్రభావాలను కలిగి ఉంది. సముద్ర రవాణాను స్థిరీకరించడానికి, అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలు నిరంతరం అందుబాటులో ఉండేలా నిర్ధారించడానికి తక్షణ దౌత్య ప్రయత్నాలు అవసరమని ఆ సంస్థ నొక్కి చెప్పింది.

**నౌకల స్వాధీనాన్ని ఖండించిన షిప్పింగ్ సంస్థ**

ఇదిలా ఉండగా, వాణిజ్య నౌకలను పరస్పరం స్వాధీనం చేసుకోవడంపై అమెరికా, ఇరాన్‌లను అంతర్జాతీయ షిప్పింగ్ ఛాంబర్ విమర్శించింది. నిర్బంధంలో ఉన్న సిబ్బందిని తక్షణమే విడుదల చేయాలని అది పిలుపునిచ్చింది. సముద్రయాన సిబ్బందిని స్వేచ్ఛగా, ఎలాంటి వేధింపులు లేకుండా పనిచేయడానికి అనుమతించాలని మెరైన్ డైరెక్టర్ జాన్ స్టాపర్ట్ అల్ జజీరాతో అన్నారు. ఆయన ఈ సంఘటనలను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా, నౌకాయాన స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. రాజకీయ పలుకుబడి కోసం వాణిజ్య నౌకాయానాన్ని ఉపయోగించవద్దని హెచ్చరించారు. ప్రపంచంలోని అధికశాతం వాణిజ్య నౌకాదళానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సంస్థ, ఇటువంటి చర్యలు ప్రపంచ వాణిజ్య మార్గాలను మరింత అస్థిరపరిచే ప్రమాదం ఉందని పేర్కొంది.



## ట్రంప్‌పై కాల్పులు జరిపిన అలెన్ ఎవరు?

మొదటి పేజీ తరువాయి

అధికారికంగా వెల్లడించనప్పటికీ, హోటల్ రికార్డులు, ఈ సంఘటనకు సంబంధించిన ఇతర వివరాల ఆధారంగా పలు మీడియా సంస్థలు ఆ వ్యక్తిని గుర్తించాయి. కాలిఫోర్నియాలోని టోరెన్స్‌కు చెందిన 31 ఏళ్ల వ్యక్తి అయిన కోల్ థామస్ అలెన్‌గా అతడిని గుర్తించారు. ఈ కార్యక్రమానికి ముందే అతను వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో బస చేస్తున్నాడని, హోటల్‌లో గది కోసం అతడు అందించిన పేరు, వ్యక్తిగత వివరాలనే మీడియా ఇప్పుడు అతన్ని గుర్తించడానికి ఉపయోగించుకుందని నివేదికలు సూచిస్తున్నాయి. కాగా, అతడు ఓ ఉన్నత విద్యావంతుడిగా తేలింది. అతడి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 2017లో మెకానికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేశాడు. అంతేకాదు, 2017లో కాల్టెక్‌లో అతడు విద్యార్థిగా ఉన్నప్పుడే వీల్‌చైర్స్‌కు ఎమర్జెన్సీ బ్రేక్‌ను ప్రయోగాత్మకంగా రూపొందించాడు. ఈ అంశం గురించి స్థానిక పత్రికలో కథనం కూడా వెలువడింది. ఆ తర్వాత కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తిశాడు. 2018లో ఓ వీడియోగేమ్‌ను కూడా తయారు చేసి ట్రేడ్‌మార్క్ కోసం రిజిస్టర్ చేసుకొన్నాడు. ఇటీవల ఫస్ట్‌లా పేరిట మరో గేమ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు లింక్డిఇన్‌లో వెల్లడించాడు. 2014లో జెట్ ప్రొపెల్షన్ ల్యాబ్‌లో నాసా నిర్వహించిన ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో కూడా పాల్గొన్నాడు. ప్రస్తుతం టెస్ట్ ప్రిపరేషన్ ట్యూటరింగ్ కంపెనీ సీ2 ఎడ్యుకేషన్‌లో టీచర్‌గా పనిచేస్తున్నట్లు ప్రొఫైల్‌లో ఉంది. డిసెంబర్ 2024లో టీచర్ ఆఫ్ ది మంత్‌గా కూడా ఎంపికయ్యాడు.
అతడు డెమోక్రటిక్ పార్టీకి సానుభూతిపరుడిగా తెలుస్తోంది. కమలా హ్యారిస్ అధ్యక్ష ప్రచారానికి 25 డాలర్లు విరాళం కూడా ఇచ్చినట్లు ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ రికార్డులు చెబుతున్నాయి.

### అధిష్టానం నిర్ణయాన్ని

## శిరసావహిస్తా

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి, నేను ఇద్దరం స్పష్టం చేశాం, అని శివకుమార్ వ్యాఖ్యానించారు. మే 15న తన పుట్టినరోజు సందర్భంగా ఏవైనా కీలక ప్రకటనలు వెలువడతాయా అనే విషయంపై ఊహాగానాలు చేసేందుకు ఆయన నిరాకరించారు. షెడ్యూల్డ్ కులాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సవరించిన అంతర్గత



రిజర్వేషన్ల విధానంపై బీజేపీ చేసిన విమర్శలకు శివకుమార్ దీటుగా బదులిచ్చారు. ఈ చర్య కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చడమేనని సమర్థిస్తూ, బీజేపీ తన హయాంలో ఈ విషయంపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఒక సమతుల్ పరిష్కారాన్ని కనుగొనే ప్రయత్నం చేసిందని ఆయన పేర్కొన్నారు. తన పుట్టినరోజుకు ముందు, రహదారులపై సంబరాల ఫ్లెక్సీ బ్యానర్లు లేదా ప్రకటనలను ఏర్పాటు చేయవద్దని ఉప ముఖ్యమంత్రి అనుచరులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఇది తన వ్యక్తిగత అభ్యర్థన అని పేర్కొంటూ, ఈ ఆదేశాన్ని ఉల్లంఘించిన వారిపై, పార్టీ కార్యకర్తలతో సహా కేసులు నమోదు చేసి, భారీ జరిమానాలు విధించాలని ఆయన నగర కార్పొరేషన్ కమిషనర్లను ఆదేశించారు.

## ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన తృణమూల్

మొదటి పేజీ తరువాయి

వారి 15 ఏళ్ల అరాచక పాలనలో అనేక ప్రధాన అత్యాచార, హత్య ఘటనలు జరిగాయి. ఆర్.జి. కార్ మెడికల్ కాలేజీ అత్యాచారం, హత్య, కాస్బా లా కాలేజీ అత్యాచారం, పార్క్ స్ట్రీట్ సామూహిక అత్యాచారం, హన్స్‌ఖాలి అత్యాచారం, హత్య, కాందుని సామూహిక అత్యాచారం, దుర్గాపూర్ మెడికల్ కాలేజీ అత్యాచారం కేసు, అంటూ చిట్టా చదివారు. నిర్దయమైన



తృణమూల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెంగాల్‌లోని ప్రతి సోదరి, కుమార్తె ఇప్పుడు నిలబడింది, మొదటి దశ పోలింగ్‌లో మనం దీనిని ఒక చిన్న ఛాయను చూశాము, అని ఆయన పేర్కొన్నారు. మే 4, అంటే ఫలితాల వెల్లడి రోజు తర్వాత, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ప్రతి గూండా, ప్రతి అణచివేతదారుడు, ప్రతి అవినీతిపరుడి లెక్క తేలుస్తాం అని ఆయన అన్నారు.

#### మహిళల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాలు

మహిళల కోసం ఉద్దేశించిన పలు సంక్షేమ పథకాలను కూడా ప్రధానమంత్రి వివరించారు. వీటిలో రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా కవరేజీ, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల కోసం ఉచిత పరీక్షలు, టీకాలు, గర్భధారణ సమయంలో రూ. 21,000 ఆర్థిక సహాయం, అలాగే బాలికలు పట్టభద్రులైనప్పుడు రూ. 50,000 ఆర్థిక తోడ్పాటు వంటి పథకాలు ఉన్నాయి. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఏటా రూ. 36,000 లభిస్తాయని, అలాగే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. టిఎంసి, మమతా బెనర్జీకి మహిళలు ఒక కీలకమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. టిఎంసి ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక పథకాలను అమలు చేస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 29న రెండవ, తుది దశ పోలింగ్ జరగనుంది, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# రీగన్ నుంచి ట్రంప్ వరకు

**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :** వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఒక దుండగుడు కాల్పులు జరిపే యత్నం చేశాడు. కాగా, ఆ డిన్నర్ జరుగుతున్న హిల్టన్ హోటల్‌కు ఇటువంటి కాల్పుల ఘటనలు కొత్త కాదు. దశాబ్దాలుగా దాని గోడలు హింసాత్మక చరిత్రను మోస్తున్నాయి. 45 సంవత్సరాల కిందట జరిగినదే, శనివారం రాత్రి అదే వేదికపై జరిగింది. ఒక కాల్పుల ఘటన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను బాల్‌రూమ్ నుండి బయటకు తీసుకువెళ్లారు. అట్టహాసంగా, ఉన్నత వర్గాల పరిచయాలతో ఉత్సాహంగా సాగాల్సిన ఆ రాత్రి, 1981 నాటి భయంకరమైన ప్రతిధ్వనిలా అనిపించడంతో, చరిత్రను గుర్తుచేసే ఒక నిష్ఠూరమైన ఘట్టంగా మారింది. సర్వ సైన్యాధ్యక్షుడిగా ట్రంప్ తన మొదటి వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ విందుకు హాజరయ్యారు; మీడియాతో ఆయనకున్న సంబంధాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అది తనంతట తానుగా ఒక ప్రత్యేకమైన ఘట్టం. అతిథులు తమ సలాడ్లు తినడం ప్రారంభించబోతున్న సమయంలో, అక్కడి వాతావరణం వేడుక నుండి ప్రాణరక్షణకు మారిపోయింది. సాయుధ భద్రతా సిబ్బంది గదిలోకి ప్రవేశించి, హాజరైన 2,300 మందిని నేలపై పడుకోమని గట్టిగా అరిచారు. కొద్దిసేపటికే సంగీతం స్థానంలో పళ్ళెం పగిలిన చప్పుడు, తుపాకీ కాల్పుల పదునైన శబ్దాలు వినిపించాయి. అధ్యక్షుడిని బలవంతంగా తీసుకువెళ్ళడానికి ఏజెంట్లు వేదిక వైపు దూసుకురాగా, గది పూర్తిగా నిశ్శబ్దంగా మారిపోయింది. గందరగోళం సద్దుమణిగిన తర్వాత, ఆ హోటల్ పెద్దగా సురక్షితమైంది





కాదు అని ట్రంప్ అన్నారు. ఎందుకంటే, 1981లో, నాటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై ఈ హోటల్ వెలుపలే హత్యాయత్నం జరిగింది. ఆ తర్వాత, భద్రత కోసం హిల్టన్ ఒక సురక్షితమైన గ్యారేజీని, ఒక ప్రైవేట్ ప్రెసిడెన్షియల్ సూట్‌ను జోడించింది. శనివారం నాడు, ట్రంప్‌ను అదే అత్యవసర సూట్ ద్వారా ఆ ప్రాంగణం నుండి సురక్షితంగా బయటకు తరలించడంతో, అవే సౌకర్యాలు పరీక్షకు గురయ్యాయి. కాలిఫోర్నియాకు చెందిన 31 ఏళ్ల కోల్ టోమాస్ అలెన్‌ను అనుమానితుడిగా గుర్తించారు. అతను కట్టుదిట్టమైన భద్రతను దాటుకుని లోపలికి ప్రవేశించినట్లు సమాచారం. విందుకు గంటల ముందే ప్రారంభమైన మాగ్నెటోమీటర్లు, సీక్రెట్ సర్వీస్ తనిఖీలను సైతం లెక్కచేయకుండా, అతను ఒక షాట్‌గన్, ఒక హ్యాండ్‌గన్, అనేక కత్తులతో ఆ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. అతను ఆ హోటల్‌లో అతిథి అయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు; భద్రతా సిబ్బంది బాల్‌రూమ్‌పై దృష్టి సారించిన సమయంలో, భవనం లోపలి నుంచే అక్కడ ప్రవేశించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

#### 1981లో సరిగ్గా ఏమి జరిగింది

ఎఫ్‌బిఐ ఆర్కైవ్స్ ప్రకారం, ఆ గదిలో ఉన్న చాలా మందికి, ఆ రాత్రి 1981 మార్చి 30వ తేదీని గుర్తుచేసింది. ఆ రోజు జాన్ హింక్లీ జూనియర్ హిల్టన్ అనే వ్యక్తి అక్కడకు వచ్చిన నాటి అధ్యక్షుడు రీగన్‌పై హత్యా ప్రయత్నం చేశాడు. అతని .22-కాలిబర్ రివాల్వర్‌తో ఆరు రౌండ్ల కాల్పులు జరిగాయి. అందులో ఒక బుల్లెట్ తిరిగి వచ్చి (రికొచెట్) రీగన్ ఛాతీలోకి దూసుకొచ్చిన ఆయన ఊపిరితిత్తులకు రంధ్రం చేసింది. ఆయన తన లిమోసిన్‌లో రక్తం కక్కడాన్ని మొదలుపెట్టే వరకు ఆ గాయాన్ని ఎవరూ గమనించలేదు. ఆయన 12 రోజుల ఆసుపత్రి వాసం నుండి ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఆ సంఘటన సీక్రెట్ సర్వీస్ నియమావళిపై ఒక శాశ్వత మచ్చను మిగిల్చింది. ఆ తర్వాత, ట్రంప్ సురక్షితంగా నిష్క్రమించడానికి ఉపయోగించిన ప్రెసిడెంట్స్ వాక్ ఉనికిలోకి వచ్చింది. భద్రతపై ప్రశ్నలు తలెత్తుతుండగా, అధికారులు తమ బహుళ అంచెల రక్షణ వ్యవస్థను సమర్థించుకుంటున్నారు. ముప్పు తీవ్ర స్థాయికి చేరకముందే దానిని నిర్వీర్యం చేయడం వల్లే భద్రతా చర్యలు ఫలించాయని వారు వాదిస్తున్నారు. అయితే, ఒక సాయుధుడు అంత దగ్గరకు ఎలా వచ్చాడనే దానిపై దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, ఈ ఘటన తర్వాత అమెరికా అధ్యక్షులకు అదృష్ట లేదా దురదృష్ట ప్రదేశంగా వాషింగ్టన్ హిల్టన్‌కు ఉన్న పేరు చర్చనీయాంశంగానే మిగిలిపోయింది.

## ఈసారి ప్లీనరీ లేదు..

# ప్రతీచోట గులాబీ జెండాలు ఎగరాలి

- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాలు ఎగరేయాలని పిలుపు
- నేడు తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం
- వేసవి తీవ్రత దృష్ట్యా ప్లీనరీకి బదులు కార్యవర్గ సమావేశం
- ఆహ్వానం ఉన్నవారు మాత్రమే రావాలని నేతలకు కేటీఆర్ సూచన
- నియోజకవర్గాల్లోనే వేడుకలు జరపాలని కార్యకర్తలకు విజ్ఞప్తి



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి) :** బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు ఎగరేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు పార్టీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయం తెలిపారు. గ్రామాలు, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో జెండా వందనం చేసి వేడుకలు జరపాలని అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. వాస్తవానికి ప్లీనరీ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, ఇటీవల జగిత్యాలలో భారీ సభ నిర్వహించడం, ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈసారికి కార్యవర్గ సమావేశానికే పరిమితం చేస్తున్నట్లు వివరించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులకు మాత్రమే ఆహ్వానాలు పంపినట్లు పార్టీ స్పష్టం చేసింది. ఆహ్వానం ఉన్నవారు మాత్రమే తెలంగాణ భవన్‌కు రావాలని, మిగతా నాయకులు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం 2001లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించగా, 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళికతో 2022లో పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ గెలవలేక పోయింది.

# ప్రచండ భానుడు

- నాగర్‌కర్నూల్‌లో పిడుగుపాటుకు ఒక యువకుడి మృతి
- జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు, కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు
- మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఎఎంఎస్) :** తెలంగాణలో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. వడదెబ్బ కారణంగా శనివారం ఒక్కరోజే నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. హనుమకొండ జిల్లాకు చెందిన సాదుల నరహరి (58), వరంగల్‌కు చెందిన ఎండీ యాకూబీ (63), మంచిర్యాల జిల్లా వాసి కొట్రంగి జయరాం (40), సూర్యాపేట జిల్లాకు చెందిన మామిడి నరసింహ (51) వడదెబ్బతో మరణించారు. వీరంతా పనులకు వెళ్లి అస్వస్థతకు గురైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా 44.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కుమరంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లోని పలుచోట్ల 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కామారెడ్డి, ఆదిలాబాద్, భూపాలపల్లి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతోంది.

#### పిడుగుపాటుకు యువకుడు బలి

నాగర్‌కర్నూల్ జిల్లాలో పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందాడు. బల్మూరు మండలం మైలారం గ్రామానికి చెందిన గట్టు సలేశ్వరం (19) పొలంలో గేదెలను కాస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలు కావడంతో రక్షణ కోసం తాటిచెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మరణించాడు.

### పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తత్వం యువతకు మార్గదర్శకం

## ఉత్తమ సమాజ నిర్మాణమే జై స్వరాజ్ లక్ష్యం

**ఆరాధనోత్సవాల్లో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ**



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి) :** తెలుగు భూమి గర్వించదగిన మహాయోగి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి తత్వం ఈనాటి యువతకు ఎంతో అవసరమని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా హైదరాబాద్లోని సరూర్ నగర్ మున్సిపల్ గ్రౌండ్లో విశ్వ కర్మ జేఏసీ చైర్మన్ రాయబండి పాండురంగ చారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీరబ్రహ్మేంద్ర స్వామి కేవలం భవిష్య వాణి చెప్పిన మహర్షి మాత్రమే కాదని, సమాజంలో సమానత్వం, నీతి, ధర్మం స్థాపనకు మార్గం చూపిన తత్వవేత్త అని ఆయన తెలిపారు. కుల, మత భేదాలు లేకుండా ప్రతి మనిషి సమానమే అనే సందేశం ఆయన తత్వంలో ప్రధానంగా కనిపిస్తుందని కేఎస్ఆర్ గౌడ చెప్పారు. ఈనాటి యువత ఆధునికత పేరుతో మూలాలను కోల్పోతున్న సందర్భంలో, వీరబ్రహ్మం గారి బోధనలు వారికి సరైన దిశానిర్దేశం చేస్తాయని కాసాని అభిప్రాయపడ్డారు. కష్టకాలాల్లో ధైర్యంగా నిలబడటం, నిజాయితీతో జీవించడం, సమాజానికి సేవ చేయడం వంటి విలువలు ఆయన తత్వంలో నిక్షిప్తమై ఉన్నాయని తెలిపారు. జై స్వరాజ్ పార్టీ సమాజంలో న్యాయం, సమానత్వం, స్వీయగౌరవం నెలకొల్పేందుకు కృషి చేస్తోందని, ఇది వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశయాలకు అనుగుణంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. “యువత మారితే దేశం మారుతుంది. యువతలో చైతన్యం తీసుకురావడమే నిజమైన రాజకీయ ధర్మం” అని కాసాని అన్నారు. ఈ నేపథ్యంలో జై స్వరాజ్ పార్టీ యువతకు వీరబ్రహ్మం తత్వం పరిచయం చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. చివరగా, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మికత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాండురంగ చారి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా వీరబ్రహ్మేంద్ర స్వామి తత్వాన్ని ఆచరించాలని, ఆయన చూపిన మార్గంలో నడిచి తమ జీవితాలను చరితార్థం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాసాని శ్రీనివాసరావు గౌడను కమిటీ సభ్యులు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఎల్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, మల్లాచారి, ద్రోణాచారి, కృపాచారి, ఘోర శ్యాం పాల్గొన్నారు.

## మా సమయం ఆరంభమయ్యింది

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఎఎంఎస్) :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. ‘తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)’ పేరుతో కొత్త పార్టీని ప్రకటించిన ఆమె, ఆ తర్వాత చేసిన తొలి ట్వీట్ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ‘మీ టైం పూర్తయ్యింది.. మా టైం మొదలైంది" అంటూ ఎక్స్‌లో ఆమె పోస్టు పెట్టారు. శనివారం హైదరాబాద్‌లోని మునీరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో తన పార్టీ ఒక కొత్త శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్న కవిత, ఎట్టకేలకు సొంత పార్టీతో ప్రజల ముందుకు వచ్చారు. ఈ పరిణామంలో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తన తండ్రి కేసీఆర్ స్థాపించిన పార్టీ అసలు పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)'ని పోలి ఉండేలా 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని నామకరణం చేయడం. బీఆర్ఎస్ నుంచి వేరుగా, సొంత రాజకీయ అస్తిత్వం కోసం కవిత ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆమె చేసిన ట్వీట్, ఎవరిని ఉద్దేశించిందనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి.






# గ్రేటర్ హైదరాబాద్



## ప్రతాప్ లింగం మృతి బాధాకరం

**మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**



**షాద్ నగర్, ఏప్రిల్ 26 (వుదయం) :** స్థానిక విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ్, టీవీ9 రిపోర్టర్ శివ కుమార్ ల తండ్రి ప్రతాప లింగం మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి అన్నారు. అనారోగ్యం కారణంగా ఆయన మరణించిన నేపథ్యంలో స్థానిక వెంకటేశ్వర కాలనీ లోపల ఆయన ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. మంచి వ్యక్తిగా, వివాదరహితుడిగా పేరుపొందిన ప్రతాప లింగం మరణం అత్యంత బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి ఆ దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రిపోర్టర్‌ను పరామర్శించిన జర్నలిస్టులు

**కీర్తిశేషులు ప్రతాప్ లింగం సేవలు చిరస్మరణీయం**



**షాద్ నగర్, ఏప్రిల్ 26 (వుదయం) :** షాద్ నగర్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగి వి ప్రతాప్ లింగం సేవలు చిరస్మరణీయమని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా కేపి, టీడబ్ల్యూజెఎఫ్ షాద్ నగర్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, రిపోర్టర్ శివకుమార్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి బూర్గుల శ్రీహరి తదితరులు పేర్కొన్నారు. ప్రతాప్ లింగం ఆకస్మిక మృతి పట్ల ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి ఆయన కుమారుడు సీనియర్ జర్నలిస్టు టీవీ9 రిపోర్టర్ శివకుమార్ ను ప్రత్యేకంగా కలుసుకొని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. గత కొంతకాలంగా తన తండ్రి ప్రతాప్ లింగం అనారోగ్య కారణంగా ఉన్నారని ఎక్కువ ఎండల నేపథ్యంలో వడదెబ్బతో మృతి చెందినట్టు అనుమానాలు వ్యక్తం చేశారు. సందర్భంగా శివకుమార్ కుటుంబ సభ్యులను తదితరులను జర్నలిస్టులు తదితరులు పరార్శించారు.

## సర్పంచ్ బందెయ్యను పరామర్శ

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, ఏప్రిల్ 26 (వుదయం) :** శంషాబాద్ లిమ్స్ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జిల్లేడు చౌదరి గూడెం మండలం ఎలుకగూడెం గ్రామ సర్పంచ్ బందెయ్యని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే శంకర్ తదితరులు ఆసుపత్రికి తరలివెళ్లి సర్పంచ్ బందెయ్యను కలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని డ్యూటీ డాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. నిన్న గ్రామంలో రాంరెడ్డి తదితరులు బంధెయ్య పై హత్యాయత్నం చేసిన విషయం విధితమే. నియోజకవర్గం లో సంచలనం సృష్టించిన వ్యవహారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంఘటనను చాలా సీరియస్ గా తీసుకున్నారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసు శాఖను ఆదేశించారు. ప్రస్తుతం లిమ్స్ ప్రైవేట్ హాస్పిటల్ లో సర్పంచికి ఉన్నత వైద్యం అందిస్తున్నారని ప్రాణాలకు ఎలాంటి ధోకా లేదని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఎమ్మెల్యే వెంట కొత్తూరు ముడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహా యాదవ్, మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## యువత స్వయం కృషితో ముందుకు రావాలి



**చేవెళ్ల,ఏప్రిల్26 (వుదయం) :** యువత స్వయం కృషితో ముందుకు రావాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ పిలుపునిచ్చారు. స్థానిక యువత తమ ప్రతిభను గుర్తించి, స్వీయ ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ఆయన సూచించారు. సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, కష్టపడి పని చేస్తే విజయాలు సాధ్యం అవుతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలో అది వారం నూతనంగా ఏర్పాటు చేసిన ఒక రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు. వ్యాపార రంగంలో కొత్తగా అడుగుపెడుతున్న యువతకు ఇది మంచి అవకాశం అని భీమ్ భరత్ అభినందించారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలపై మాత్రమే ఆధారపడకుండా, స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకొని యువత ఆర్థికంగా బలపడాలని సూచించారు.ఈ ప్రారంభోత్సవం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఇది దోహదపడుతుందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# ఘనంగా వాసవి జయంతి





**రామచంద్రాపురం,ఏప్రిల్ 26 (వుదయం):** భారతి నగర్ డివిజన్‌లోని బొంబాయి కాలనీలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి 4644వ జయంతి మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, వారు దేవిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులతో మాట్లాడి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంటా అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బొమ్మ చంద్రశేఖర్, నాగేష్‌తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కాలనీ వాసులు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి వేడుకలు



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి ) :** వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని పురస్కరించుకొని సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి ప్రగతి నగర్ లోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శ్రీ వాసవి సేవక్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, రాష్ట్ర వైశ్య ఫెడరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్యఅతిధులుగా హాజరై శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మం, దానం, దయకు ప్రతిరూపమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి ఇంటర్నేషనల్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు కృష్ణమూర్తి, వినయ్, వెంకట్, సామ్రాజ్యలక్ష్మి, శ్రీ వాసవి సేవక్ నూతన కమిటీ చైర్మన్ అల్లాడి మహేష్ గుప్తా, ఫౌండర్స్ కోడూరి మురళి గుప్తా, నీరుమల్ల వెంకటేష్ గుప్తా, ప్రెసిడెంట్ వంశీ కిషోర్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ గుప్తా, జనరల్ సెక్రెటరీ నిజాం వంశీ గుప్తా, ట్రెజరర్ రాకేష్ కుమార్ గుప్తా, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పునర్జన్ ఫౌండేషన్ మజ్జిగ పంపిణీ



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి ):** కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సూచనల మేరకు సేవయే పరమావధిగా కాంగ్రెస్ నాయకులు బొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (తాతిరెడ్డి) సహకారంతో పునర్జన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ ప్రగతి నగర్ 276 డివిజన్ 3 మంకీస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణి కేంద్రంలో 13వ రోజు ఆదివారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. సుమారు 4300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఎం మన్ కీ బాత్ కార్యక్రమం

**టీవీలో వీక్షించిన జిన్నారం బిజెపి నాయకులు**



**జిన్నారం, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి) :** జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి నివాసంలో ఆదివారం పార్టీ శ్రేణులు ప్రధాని నరేంద్ర మోడీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని స్వయంగా టీవీలో వీక్షించారు. ప్రధాని పేర్కొన్న సలహాలు సూచనలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని వైస్ చైర్మన్ సూచించారు. బిజెపి శ్రేణులు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని తప్పకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజిరెడ్డి పల్నాటి శ్రీనివాస్ పూడూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సేన ఆవిర్భావ సభ ఘన విజయం

**కార్యకర్తలకు కప్పాటి పాండురంగా రెడ్డి కృతజ్ఞతలు**



**చేవెళ్ల, ఏప్రిల్ 26 (వుదయం) :** మేడ్చల్ వేదికగా ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సేన (టిఆర్ ఎస్) ఆవిర్భావ సభ భారీ విజయాన్ని నమోదు చేసుకుంది.తెలంగాణ రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికిన ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేశారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, సభను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి, కృతజ్ఞతలు తెలిపారు.రంగారెడ్డి జిల్లాలోని గ్రామాలు, మండలాల నుంచి భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజల ఉత్సాహం, క్రమశిక్షణ ఈ సభను చారిత్రాత్మకంగా నిలిపాయని ఆయన పేర్కొన్నారు.'టిఆర్ ఎస్ 'పేరుతో ప్రజల్లో నూతన ఉత్సాహం పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన' అనే పేరు పెట్టడం ద్వారా ప్రజల్లో ఉన్న రాజకీయ వెలితి తొలిగిందని, ప్రాంతీయ భావోద్వేగాలకు కొత్త ఊపు వచ్చిందని ఆయన అన్నారు. ఈ నిర్ణయం ప్రజలతో పార్టీకి ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచిందని కప్పాటి అభిప్రాయపడ్డారు.

**పాంచజన్యం తో అభివృద్ధి దిశగా అడుగులు**

సభలో ప్రకటించిన 'పాంచజన్యం' - విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం, వ్యవసాయం/అభివృద్ధి వంటి ఐదు ప్రధాన అంశాలు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాలు సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించి, రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తాయనే నమ్మకం వ్యక్తమవుతోందన్నారు.తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామన్న హామీ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఆయన అన్నారు. ఉద్యమ స్ఫూర్తిని కాపాడటం పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.కవిత ప్రసంగం హైలైట్ ఆవిర్భావ సభలో కవిత ప్రసంగం ప్రజలను బలంగా ఆకట్టుకుంది. రాష్ట్ర సమస్యలను స్పష్టంగా వివరిస్తూ, భవిష్యత్తుపై ఆమె చూపిన విజన్ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని నేతలు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల హక్కుల కోసం కవిత నాయకత్వంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని కప్పాటి పాండురంగా రెడ్డి స్పష్టం చేశారు.

## రాకమచర్ల వెంకట దాసు సాహిత్యం ప్రపంచవ్యాప్తం కావాలి



**చేవెళ్ల, ఏప్రిల్ 26(వుదయం) :** భక్తి సాహిత్యంలో అపూర్వ స్థానం సంపాదించిన రాకమచర్ల వెంకట దాస్ కీర్తనలు ప్రపంచానికి పరిచయం కావాల్సిన అవసరం ఉందని ప్రముఖులు అభిప్రాయపడ్డారు.ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిథులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహరెడ్డి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, అనంత వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తూర్పు మల్లారెడ్డి సభకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ——ఉమ్మెత్తల గ్రామంలో పీఠం స్థాపించిన రాకమచర్ల వెంకట దాసు లక్షకు పైగా సంకీర్తనలు రచించి భక్తి సంపదను విశేషంగా విస్తరింపజేశారని కొనియాడారు. ఆయన రచనలు భాషా మాధుర్యంతో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటాయని తెలిపారు. చిన్నాటి నుంచే ఈ కీర్తనలు ప్రజల జీవితాల్లో భాగమయ్యాయని గుర్తుచేశారు.ప్రత్యేక సంచిక ఆవిష్కరణ వెంకట దాసు జీవిత, సాహిత్యంపై ప్రత్యేక సంచికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఆయన తత్వాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచించారు. తెలంగాణ సాహిత్య వారసత్వాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉద్ఘాటించారు.తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ సంచికను ముద్రించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అక్నపూర్ భజన బృందం భక్తి గీతాలతో సభను మంత్ర ముగ్ధులను చేసింది.ఈ కార్యక్రమంలో అనంత వ్యవస్థాపకులు దోరవేటి, అధ్యక్షులు ఆశీర్వాదం, కార్యదర్శి కమలేష్, పసుల హనుమంతు, ఉపాధ్యక్షులు వడచర్ల సత్యం, ప్రముఖ కవి దుబ్బాకుల కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యంపై పోరాడుదాం

**కాజిపల్లి గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం**



**జిన్నారం, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి)** గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని కాజిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు అడ్వకేట్ దండే రమాకాంత్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో ముఖ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయాలను అడ్వకేట్ దండే రమాకాంత్ వెల్లడించారు. పరిశ్రమల కాలుష్య వ్యర్థ జలాలతో ధార్మి చెరువు రక్షించుకోవాలని, కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడాలని తీర్మానించారు. గండి చెరువు ఎఫ్ టి ఎల్ పరిధి తగ్గడంపై చర్చించి భూములను కాపాడుకోవాలని సూచించారు. కాలుష్య సమస్యలపై రాష్ట్ర పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా రెడ్ జోన్ లో ఉన్న కాజిపల్లి జిఎంఆర్ కాలనీలకు మానవతా దృక్పథంతో తాగునీరు సరఫరా చేసే పిసిబి నుండి హెచ్ఎండబ్ల్యూ ఎస్ ఎస్ బి యంత్రంగానికి లేక ఇవ్వాలని తీర్మానించారు. ఇక సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటికి సరిపడా తాగునీరు నిరంతర సరఫరా జరిగేలా అదే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించేలా కోరాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ మాజీ ఎంపీటీసీ భార్గవ్ నాయకులు శ్రీను శ్రవణ్ జేఏసీ సభ్యులు నాగరాజు రైస్ లక్ష్మణ్ టింకు వీరస్వామి గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు




**జిన్నారం ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి)** బొల్లారం డివిజన్ పరిధిలోని బీసీ కాలనీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్థానిక ప్రాథమిక పాఠశాల సమీపంలో చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కాలనీ యువకులు తెలిపారు. మొదటిరోజు స్థానికులకు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. చలివేంద్రం ద్వారా ప్రతిరోజు చల్లటి తాగు నీటిని బాటసారులకు ప్రజలకు అందించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ యువకులు స్థానికులు పాల్గొన్నారు.

## బీరంగూడలో ఘనంగా హిందూ మహా సమ్మేళనం



**బీరంగూడ ఏప్రిల్26 ( వుదయం) :** హిందూ సమాజ చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా బీరంగూడలో హిందూ మహా సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించబడింది. గ్రీన్ మీడోస్ కాలనీ పార్క్‌లోని వినాయక మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హిందూ బంధువులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. సనాతన హైందవ ధర్మం కేవలం ఒక మతం మాత్రమే కాకుండా, విశ్వమానవతా విలువలను ప్రతిబింబించే జీవన విధానమని నిర్వాహకులు తెలిపారు. వసుధైవ కుటుంబ భావనతో విశ్వశాంతిని కోరుకునే గొప్ప సంస్కృతి మనదని, ప్రకృతిని దైవంగా భావించే సంప్రదాయం హిందూ ధర్మానికి ప్రత్యేకతగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న హిందూ సమ్మేళనాల సరళిలో భాగంగా బీరంగూడలో నిర్వహించిన ఈ మహా సమ్మేళనం ద్వారా హిందూ సమాజాన్ని ఐక్యపరచడం, స్వధర్మం పట్ల నిబద్ధత పెంపొందించడం, సేవా గుణాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమానికి హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ సహ కార్యవాహ ముఖ్య వక్తగా పాల్గొని హిందూ ధర్మ పరిరక్షణ, సమాజ ఐక్యతపై ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. భక్తి గీతాలు, సాంప్రదాయ ప్రదర్శనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ సమ్మేళనంలో పంచ పరివర్తన కుటుంబ బంధాల బలపరచడం,పర్యావరణ పరిరక్షణ,సామాజిక సమరసత,స్వదేశీ ఉత్పత్తుల వినియోగం,పౌర బాధ్యతలపై చైతన్యం కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కుల, మత, భాష, రాజకీయాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "మనమంతా హిందువులం - మనమంతా బంధువులం" అనే నినాదాలు మార్మోగాయి.హిందూ సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణకు ఈ మహా సమ్మేళనం వేదికగా నిలిచింది.

## రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**రంగారెడ్డి, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి)** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సోదరులంతా తప్పక రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తద్వారా **రిజిస్ట్రేషన్ ఐడి నంబరు పొందాలని శ్రీమతి డి. ఉష, జిల్లా వ్యవసాయ అధికారి గారు రైతులకు సూచించారు.

**రైతు రిజిస్ట్రేషన్ ఎందుకు?**

★ రైతు బీమా, సబ్సిడీలు మరియు ఇతర పథకాలు రావడానికి.

★ ప్రభుత్వ పథకాలలో పారదర్శకత కోసం.

★ ప్రత్తి, వరి కొనుగోలు మరియు పంట రుణాలకు ఇది కీలకం.

* కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా పొందవచ్చు.

* వరి కొనుగోలు మరియు పంట రుణాల కోసం.

★ ప్రభుత్వ పథకాలలో పారదర్శకత పెరుగుతుంది.

**అవసరమైన పత్రాలు:**

★ ఆధార్ కార్డు

★ భూమి పట్టా పాసు బుక్కు

★ ఆధార్ లింకు మొబైల్ నంబర్

**ఎక్కడ నమోదు చేసుకోవాలి?**

★ మీ గ్రామ పరిధిలోని **రైతు వేదిక** నందు **వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద మరియు దగ్గరలోని అన్ని మీసేవ కేంద్రాలలో చేయబడును.

**రిజిస్ట్రేషన్ షెడ్యూల్:**

ఏప్రిల్ 22 నుండి 30 వరకు.

★ ప్రత్యేకమైన డ్రైవ్ జిల్లా మొత్తం అమలు చేయబడుతుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం పరచుకోవాల్సిందిగా తెలియజేయడమైనది.

# స్థలదుఃఖం, జనదుఃఖం ఈ కవి చిరునామా

" I only write when I'm angry or sad"

--Fiona Apple McAfee

" All poetry is in origin of social act, in which poet and people commune"

-- George Thomson

" The poem as a site of social interaction in which dialogue and contention is never ending "

-- E.Martin Nolan

నేను ఆగ్రహంలో విషాదంలో మాత్రమే రాస్తానంటోంది కవయిత్రి ఫియోనా యాపిల్ మెకెఫీ.ఇట్లా రాసేది ఈమె ఒక్కర్తేనా, అంటే? కాదు, వ్యవస్థ మార్పు కోరుతూ రాసే ప్రతి కవి,రచయిత ఆగ్రహావేశాల్లోంచి బాధా కన్నీళ్లలోంచే రాస్తాడు. ఇందుకు కారణం ఏమై ఉంటుంది? అంటే- విషాదం అలుముకున్న చోటుకు దాపున్నే సృజనాత్మకత ఉంటుంది. ఎందుకంటే,మనిషి సంతోషంగా ఉన్నప్పుడు, ఆహ్లాదంగా ఉన్నప్పుడు ఆత్మపరిశీలన చేసుకోలేడు, ఉల్లాస స్థితి నుండి లోతైన ఆలోచన ఉత్పన్నం కాదు. భావాల విశ్లేషణా కుదరదు, ఓరిమికీ పునరాలోచనకూ ఆస్కారం ఉండదు. అయితే, సంతోషంగా ఉన్న సమయం గొప్ప సమయం కాదా! అంటే, గొప్ప సమయమే. కాకపోతే, అది సృజనాత్మక సమయం ( Creative Time)కాదు. సంతోషం సమయంలో కంటే,విచారం(melancholy)సమయంలో మనిషి 'భావోద్వేగాలు తీవ్రతరం ( Higher degree of emotions)'గా ఉంటాయి.ఈ తీవ్రతర భావోద్వేగాలు అప్పటి సంఘర్షణను కూలంకషంగా అర్థం చేసుకోవడానికి మంచి ఉపకరణాలు. ఇక్కడే సృజనకు అంకురార్పణ జరుగుతుంది. సృజన మూలాన ఎంతటి సంఘర్షణ నుండైనా మనుషులు తక్షణ ఉపశమనం పొందగలుగుతారు. ఈ ఉపశమనం వైయక్తికం మాత్రమే కాదు.సంఘర్షణ సామాజిక మైనప్పుడు సృజనా తదుపశమనమూ సామాజికం. వేదనకూ సంఘర్షణలకూ పరిష్కారం విముక్తి లభిస్తుంది.ఇదిగో ఈ విముక్తి కవితల సమాహారమే' మొలాటు' సంపుటి. కూకట్ల తిరుపతి సామాజిక సృజనకారుడు, ఇవాళ్టి Zeitgeist ను తన 'మానేరు నుడికారం'లో ప్రపంచానికి చాటింపు వేస్తున్న భాషా నవోద్యమకారుడు. మొలాటు అంటే విత్తనం వేసిన తర్వాత మొలకెత్తుతున్న క్షేత్రం. మా దిక్కు మేం 'మొలవాటు' అంటం. ఏ పంటకైనా మొలవాటును బట్టే ఉనికి ఉత్పత్తిఉంటాయి. అయితే మొలవాటును కాపాడితేనే మొక్కలు ఏపుగా ఎదిగి చేనుగా ఫలితాన్నిస్తాయి. మొలవాటు దశ సున్నితమైంది,జల్లులు లేకపోయినా కలుపు తీయకపోయినా మొలవాటు పుటమారుతుంది. రైతు కృషిని ఫలించాల్సిన చేను ఉత్త ఏగిలై కష్టమూ కరవూనోరుతెరచుకుంటాయి.అందుకే కూకట్ల తిరుపతి తన కవితా సేద్యాన్ని మొలాటుగా మనకు సమర్పిస్తున్నాడు. కవితలు అందించే సందేశాన్ని పెంపుచేసి రాశిపోయాల్సిన అవసరాన్ని సాటిమనుషులుగా మనమే గుర్తించాల్సివుంది. అంటే,మనందరం సామాజికంగా పరివర్తన చెందాల్సి ఉంది. బతుకు ప్రతి మలుపులో సంఘటితం కావాల్సివుంది. మనం పరివర్తన చెందేందుకు, సంఘటితమయ్యేందుకు కావాల్సిన Transformational Force ని తిరుపతి ఈ కవితల నిండా దట్టించి ఉంచాడు. అభివ్యక్తి నైపుణి లోపంవల్ల కవిత్వంలో స్థానీయ భాష కొన్నిసార్లు పాఠకుణ్ణి కదిలించగ పోగా కలవరపరుస్తుంది.అయితే, నుడికారపు సొంపు తెలిసిన శిల్పం అమరితే స్థానీయ భాషలో కవిత్వం దానిTransformational Force వల్ల అమేయం( Immeasurable)గా సామాన్యుల నూకలుపుకుంటుంది. సామాన్యులను కలుపుకుంటేనే కదా! కళకు సార్థకత.జార్జ్ థామ్సన్ చెప్పినట్టు 'కవిత్వం సామాజిక చర్య' గా ముందుకొచ్చినప్పుడే సామాన్యుల భారీ చేరిక ( Massive Inclusion) సాధ్యం.అప్పుడే మహాజన సంఘటన సంభవిస్తుంది. కళాసాహిత్య రంగాల్లో సబాల్టన్ ఉద్యమం మరింత పటిష్ఠంగా నిర్మాణమయ్యేది మహాజన సంఘటనతోనే.

కూకట్ల తిరుపతి మొలాటు లక్ష్యం మహాజన సంఘటనే.

ఏ సమాజానికైనా తనదైన ఒక నాగరికతా ప్రక్రియ (Civilizing Process) ఉంటుంది. దీనికి నార్బర్ట్ ఎలియస్ చెప్పినట్టు మానసిక, రాజకీయ (Mental, Political) కోణాలుంటాయి.ఈ రెండు కోణాల్లో స్వచ్ఛత పరిపూర్ణత ఇమడాల్సిందిపోయి,






నానాటికీ పేరుకుపోతున్న'హీనత (Inferiority)' 'క్షుద్రత(Occult)' లను తునుమాడేందుకు సిద్ధపడినవాడే కవి. మార్టిన్ నోలన్ బహిర్గత పరచినట్టు కవిత్వం సమాజంతో సంవాదమే కాదు,ఎడతెగని వివాదం కూడా. కవిగా కూకట్ల తిరుపతి మునుపటి వలెనే ఈ మొలాటు కవితల్లోనూ సంవాద వివాదాలను విధిగా కొనసాగిస్తున్నాడు. తననూ తన వెన్నుచూపని తనాన్ని

"మేలుకొలిపే కలం కాలుచేతులు నరికినా
ఉరితాడై ప్రాణాలను పెరికినా
గురితప్పని ఆయుధమవుతూ
కదులుతున్న కాలానికి దర్పణంగా
సదృశ్యమాన సాక్ష్యంగా
నిలుస్తుంది"(కాలానికి కళ్లుంటాయి)

అంటూ కాలం కంటికి వెలుగులను జతచేస్తున్నాడు.

**ఉష**
**వుదయం సాహిత్యం**

ప్రపంచానికి కళలు కవిత్వంతోగల బాంధవ్యాన్ని, సృజనోద్దేశాన్ని గురించి "One of the chief motives of artistic creation is certainly the need of feeling that we are essential in relationship to the world"అంటాడు సార్త్రే. మొలాటు కవితలన్నీ సార్త్రే వ్యాఖ్యను అణువణువూ ప్రతిబింబిస్తాయి.

" రచించడమంటే
వస్తువులను స్వీకరించడం
అభివ్యక్తితో శిల్పాన్ని చెక్కడమే కాదు
సుప్తచేతనకు చురకలువెట్టి
చేతనావర్తంలోకి లోకాన్ని మలుపుకోవడం"
(అక్షరాల పోత) అంటూ

కవిత్వ గుణగణాలనూ కవి బాధ్యతనూ సాహితీలోకం ముందుంచుతున్నాడు. భాష,పనిముట్ల వినియోగం మనిషిని ఈ సృష్టిలో ఇతర జంతుజాలం నుండి ప్రత్యేకం చేస్తున్న విషయాలు. వృత్తిదారుడికైతే పనిముట్లే పనిముట్లు.కవికి భాషే పనిముట్టు. 'అల్లిక(Texture), రూపం (Structure),స్వరం (Tone),శబ్ద ప్రవాహం (Rhythm) దోషరహితంగా ఉన్నప్పుడే కవిత్వం నిలబడుతుంది అంటాడు డగ్లస్ బుష్. గ్లోబలైజేషన్ పెద్ద దేశాలకు అదనపు లాభాలను కుప్పబోస్తూ గ్రామీణ భారతదేశాన్ని కుదేలు (Collapse) చేసిన వైనాన్ని

" ప్రపంచీకరణ ప్రయోగశాలగ
పల్లెల బత్కుముల్లెలు గంపగుత్తగ
కుదువబడ్డ దోప్కపు జాడల
బొండిగెలకు చెయ్యిసొరగొట్టి
బోరిగనంత కలెవెట్టిన కనరు
బొంతపేగుల మనసు కత్తిరిచ్చి
గుట్టగుడ్డలు వూడగొట్టుకుంట
మెత్తగ మెలేసిన పెట్టుబడుల నెనరు
కాళ్లకింద జాగ సుతా
కండ్ల ముంగట కదిలిపోతున్న గావర " ( బువ్వ చెట్టు కూలింది)

అంటూ దేశీయ కవితా శిల్పనైపుణితో అభిశంసించాడు.

బెర్ట్రాండ్ రస్సెల్ పండితుడు ఆత్మకథకు రాసుకున్న ముందుమాట ' What I Have Lived For' లో తనకున్న 'Three Passions (మూడు అభిరుచులు - ప్రేమ కోసం తపన, జ్ఞానం కోసం అన్వేషణ, మానవాళి బాధల పట్ల భరించలేని జాలి) ను ప్రస్తావిస్తూ ' ప్రేమ, జ్ఞానం నన్ను స్వర్గం వైపుకు నడిపించాయి. కానీ,వెంటనే జాలి నన్ను తిరిగి భూమికి తీసుకువచ్చింది- బాధితుల ఏడుపులు హాహాకారాలు నా హృదయంలో ప్రతిధ్వనించాయి. ఆకలితో అల్లాడే పిల్లలు, యుద్ధోన్మాదులచే హింసించబడుతున్న బాధితులు, అనాథ వృద్ధులు, కూలీలు, కరవు, పేదరికంలో మగ్గి సమస్త భూమండలం పై రోదించే ప్రతిఒక్కరి జీవితం అపహాస్యం చేయబడుతోంది. నేను ఈ చెడును, దుస్థితిని తగ్గించాలని కోరుకుంటున్నాను, కానీ నేను నిస్సహాయుడిని, బాధపడుతున్నాను' అంటాడు.మొదటి అభిరుచిని మైనస్ చేస్తే ఆధునిక తెలుగు కవులంతా రస్సెల్ వారసులే. తిరుపతిదీ రస్సెల్ వేదనా మార్గమే అనడానికి ఇదిగో మచ్చుకు-

" బూంబుట్టిన నాటికెల్లి
సకల జీవరాసికి కలిజల్లిన తావుల్ల
పచ్చనోట్లుగ పాయదీసుకుంట

ఇనుప ముక్కుకొంగలు తొక్కిన రేవులు

మొండాలైన మానులు
మొకం వాల్చిన మబ్బులు
రోగపు రొంపిల వొర్రెలు
జల్లెడ తూట్లువడ్డ న్యాల పెయ్యి
పీన్గుల పెంటయిన పసురాలు
మండెలుగ రాలిపడ్డ పిట్టలు

పట్టన పాతాళ్లం ముట్టిన యాల్ల
తపేల బోర్లేసిన బతుకుల తండ్లాట

నిత్తెం నిలువు దోప్కం
బొత్తిగ బావురుమన్నట్టు
బోసిపోయిన పుడమితల్లి రూపం"
( నిలువు దోప్కం).

"ఇక్కడి మట్టిదీ ఇక్కడి చెట్టుదీ ఇక్కడి గుట్టదీ పావురమసొంటి గుణమదీ" అంటూ 'ఆత్మగల్ల మట్టి' ని సదా స్మరిస్తూ,ఈ మట్టికోసం మరణించిన కొమురయ్యనూ కొమురం భీం నూ తలుస్తూ తల్లి తెలంగాణను అగ్నిగీతాల రుద్రవీణగా వర్ణిస్తున్న కూకట్ల తిరుపతిది స్థల దుఃఖం,జల దుఃఖం,జన దుఃఖం. 'ఆరుద్ర పురుగు,ఎర్రగాలు,నల్లాలం పూలు' వంటి స్థానీయ నామాలతో సంపుటులను ముద్రిస్తూ వస్తున్న తిరుపతి ఈ సంపుటినీ మొలాటు అంటూ ముందటి కవితా సంపుటుల సరసన్నే నిలిపి గౌరవిస్తున్నాడు.

సాహిత్య విమర్శలో గొప్ప కవిత్వం గురించిన చర్చ పెద్దగా జరగలేదనే చెప్పాలి.మహా అయితే కొత్త భాష,కొత్త ప్రతీకలు,పదబంధాలు,కొత్త ఇతివృత్తాల స్వీకరణ ఇత్యాది అంశాల ప్రాతిపదికగా కవిత్వ శ్రేష్ఠతను విమర్శకులు చర్చిస్తున్నారు.కొత్త వస్తుశిల్పాలనేవి కొత్త సత్యాలను శోధిస్తున్నప్పుడు కలిగే ఉప ఉత్పత్తి (By-product )మాత్రమే.నిజానికి కొత్త సత్యాలను, సృజనాత్మక స్వేచ్ఛను వెల్లడించేదే గొప్ప కవిత్వం.ఈ తరహాలో మొలాటు కవితలను చర్చిస్తే కూకట్ల తిరుపతి ఇదిగో- అలగాజనం అడుగుజనం 'తరాలుగా వొడువని తండ్లాట'కు ఇక్కడి 'రాతి యుగపు రాజిర్కం పోకడలు' కారణమంటున్నాడు. ఇక జాగృతం కావల్సింది పాఠకులూ ప్రజలే.



- డా.బెల్లి యాదయ్య
9848392690

# మానవుని ద్వంద్వ ప్రవృత్తి మీద చురక-సెన్-ర్యు

హైకు కవి తన స్వీయానుభవాన్ని వ్యక్తం చేస్తాడు. కానీ, తాను దర్శించే, అనుభవించే ప్రతి విషయం నుండి తనను తాను విడదీసికొని, నిరాపేక్షగా వ్యాఖ్యానించవలసి వుంటుంది. Attachment with detachment సాధన చేయవలసి వుంటుంది. కానీ, నేటి సంక్లిష్ట జీవన పరిస్థితులలో సగటు మనిషి జీవన మూలాలు అన్నీ తెగిపోయి, కులవృత్తులు ధ్వంసమయి పోతున్న ఈ కార్పోరేట్ ప్రపంచీకరణ దుమారంలో హైకు కవి అనివార్యంగా ఈ అసంగత్వ స్థితి నుండి బయటకు వచ్చి తన ఆవేదనలని, తన మూలాల అస్తిత్వ పోరాటాల్ని, అసమంజస సామాజిక అస్తవ్యస్తతను కూడా పలకాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాలలోనే జపనీయులు సృష్టించిన మరో సమాంతర హైకు రూపం ' సెన్ ర్యు'.

Senryū is a Japanese unrhymed, three-line poem, similar to haiku, but focused on human nature, foibles, and everyday life often with humor, satire, or cynicism rather than haiku's focus on nature and seasons.

ఈ రూపం, నిర్మాణం అంతా హైకునే పోలి వుంటుంది. సారంలో మాత్రం మానవుని చిత్త ప్రవృత్తి మీద, డాంబికాల మీద, ద్వంద్వ ప్రవర్తనల మీదా, సామాజిక అసమానతల మీద, మూఢ విశ్వాసాల మీద, మానవ బలహీనతల మీద హాస్యోస్ఫోరకంగా చురకలు వేస్తుంటుంది.

జపాన్‌లో సెన్-ర్యు ప్రక్రియను విస్తృతంగా వ్యాప్తి చేసినవాడు కరై హచిమన్ (Karai Hachiemon) అనే కవి. ఈయన కలం పేరే సెన్-ర్యు ( వ్యంగ్య కవిత ). తర్వాత కాలంలో ఈయన కలం పేరే ఈ ప్రక్రియ పేరుగా స్థిరపడింది. ఈ సెన్-ర్యు లోని విషయానికి ( Content), వ్యంగ్యానికి ( Satire), హాస్యానికి ఆకర్షితులైన ఇస్సా, ర్యొకన్ లాంటి జపనీయ కవులెందరో సెన్-ర్యులు రాసారు. జపాన్‌లోని ఎడో (ప్రస్తుత టోక్యో) కాలంలో చాలామంది అజ్ఞాత కవులు ఈ సెన్ ర్యులను రాశారు. ఆ కాలంలో ఉన్న కఠినమైన సామాజిక నియమాలను ఎద్దేవా చేయడానికి ఈ ప్రక్రియను ఒక ఆయుధంగా వాడేవారు.

సత్యపాల్ ఆనంద్, దిలీప్ చిత్రే లాంటి భారతీయ భాషా కవులు కొంతమంది సెన్-ర్యులు రాసారు. వస్తువు రీత్యా శ్రీశ్రీ రాసిన చురకలు సెన్-ర్యుని పోలి వుంటాయి. తెలుగులో సెన్-ర్యు ని సాధన చేసినవాళ్ళు బహు తక్కువ మంది. గాలి నాసరరెడ్డి గారే తొలి సెన్-ర్యు ని అనువదించి తెలుగువారికి పరిచయం చేసారు. ఇస్మాయిల్ గారు కొన్ని సెన్-ర్యు లను రాసారు. తలతోటి పృథ్వీరాజ్, బొబ్బిలి జోసెఫ్, బొల్లిముంత వెంకట రమణారావు లాంటి వారు ఈ ప్రక్రియను చేపట్టినా, కొనసాగించలేదు.

జైశ్రీ రామ్ DJ -
మనసులో రామభక్తి
పారిపోయింది.
★
సరిపోయింది -
దక్షిణ వేసిన తర్వాత
శఠగోపం
★
శ్రీ రామునికి
దండం పెట్టి చేసాడు -
లంచం సంతకం
★
వడ్డీలు పిండి
లోపలేసుకున్నాక -
ఇక రామకోటి
★
రాముడి కళ్యాణం -
అమ్మలక్కల చూపు
ఆడాళ్ళ నగలపై
★
హుండీ నిండలేదు -

ధర్మకర్తల మధ్య
వాగ్వివాదం
★
గాట్లు పడకుండా
గుండు గీయాలంటే -
చేయి తడపాలి.
★
భక్తి వ్యాపారం -
పెట్టుబడి పెద్దగా
అవసరం లేదు.
★
గుడిలో నోటీసు-
దక్షిణ ఇచ్చినోళ్ళకే
ప్రసాదం -
★
మిగిలే వుంది -
బాబాలు ఎంతగా దోచినా
భక్తుల మూఢత్వం
★
పాత భక్తులే
కొత్త భ్రమలతో -
మార్కెట్‌లో కొత్త బాబా

★
గుడి శెలవు-
కొబ్బరిచెట్నీకి శెలవు
హోటలులో
★
ముసలి పూజారికి
మతిమరపు లేదు -
సంభావన లిస్టు
★
భారీ విగ్రహాలు..
పాలరాతి మందిరాలు-
దైవం నిమిత్తమాత్రం
★
దైవభీతి లేదు -
హుండీల లెక్కింపులో
CC కెమెరాలు
★
సైన్యంలో ముప్పైయేళ్ళు -
బహుమతి ఇచ్చారు
ఓటు తీసేసి
★

తన గొయ్యి తనే
తవ్వుకుంటాడు ఓటరు-
డబ్బులు తీస్కొని
★
అన్నిటి దగ్గర డబ్బు
తీస్కొని, తలొకటి -
ఓటరు న్యాయం
★
కొదవ లేదు
కళాకారులకు -
దొంగ ఓటు ఓ కళ
★
ఒక్కరోజే రాజు -
ఓటరు బానిసబంటే
మిగతా ఐదేళ్ళు
★
అదేమిటో మరి -
ఆత్మలు కూడా వచ్చి
ఓటేసి వెళ్తాయి
★
EC మాయాజాలం -
ఒక్కరోజులో, లక్షల

ఓట్లు మాయం
★
రాజకీయ పార్టీలు -
ఎప్పటికప్పుడు మరింతగా
పతనమవుతూ
★
గుప్పించిన హామీలు
గంపలకెత్తుతున్నాయి-
గెలిచాక పార్టీలు
★
ఏలినవారి
కుక్క బిస్కట్ ఇప్పుడు -
ఫోర్త్ ఎస్టేట్
★
వాట్సప్ యూనివర్సిటీ
వీడియో పాఠాలు -
టీవీ ఛానళ్ళు
★
చాన్నాళ్ళయింది -
నికార్సయిన వార్త
మీడియాలో విని
★

ఒకటే వార్త -
ముక్కలు ముక్కలయింది
వార్తా ఛానెళ్ళలో
★
బలే కాంబినేషన్
పోలీసూ, పొలిటీషియన్ -
పాలూ నీళ్ళలా
★
లెక్కింపు -
ఓటర్ల ఐదేళ్ళ లెక్క
తప్పుతుంది.
★
కాళ్ళకు చక్రాలు కట్టి తిరిగి
ఓట్లు కొన్న నాయకుడు -
చక్రవడ్డీతో వసూలు
చేస్తాడు.
★
జైశ్రీ రామ్ అంటూ
షాపులకు నిప్పు-
చూస్తూ హనుమ శిల

★
నిలువునా దోచినా
పెద్ద పట్టింపు లేదు -
భక్తిమాదకం
★
ఆస్పత్రి గుమ్మాల్లో
దేవుళ్ళ విగ్రహాలు-
పని తేలికైంది
★
గ్యారంటీ లేవు -
పంతుళ్ళ ముహుర్తాలు
రాజకీయుల వాగ్దానాలు
★
అదే బ్రాహ్మడు
అదే సంభావన -
పెళ్ళికి, చావుకి
★
ముఖం వుండదు
బూతుల భాష వుంటుంది-
సనాతనులు

★
ఆన్‌లైన్ బుకింగ్-
శవం పాడె దగ్గర
ఏడవడానికి
★
దింపుడు కళ్ళెం -
చెవిలో అనుమానంగా
పిలుస్తూ
కాసుల కొడుకు
★
తీరని కోరికలతో
చచ్చాడు- పిండం కోసం
కాకుల కొట్లాట
★



పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

**భారతీయ కవిత**

## రైతులు

ఒక రైతును నిర్వచించినపుడు
మా నాయిన పరిస్థితి నుంచే అర్థం చేసుకుంటాను
అతను రోజూ పొద్దు పొద్దున్నే పొలానికి వెళ్తున్నా
ఒక సాలుకు సరిపడే ధాన్యం దక్కడం లేదు

ఒక రైతును నిర్వచించినపుడు
మా నాయిన పరిస్థితి నుంచే అర్థం చేసుకుంటాను
పొలంలో తన రక్తాన్ని చెమటలా ధారపోస్తున్నా
ఋణభారం నుంచి అతను విముక్తుడు కావట్లేదు

ఒక రైతును నిర్వచించినపుడు
మా నాయిన పరిస్థితి నుంచే అర్థం చేసుకుంటాను
వర్ష ఋతువు వెళ్ళి పోయినా
వానలు కురవాలని కప్పల పెళ్ళిని చేస్తూంటాడు

ఒక రైతును నిర్వచించినపుడు
మా నాయిన పరిస్థితి నుంచే అర్థం చేసుకుంటాను
వరి పచ్చగా కళకళ లాడుతుందనగా
తెగుళ్లు సోకి పంట సర్వనాశనమవుతుంది

దేశమంతా పటాటోపంతో అంగరంగ వైభవంగా
స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకున్నది
బోలెడు రైతు పథకాలను ప్రవేశపెట్టారు
కానీ మా నాయిన పరిస్థితేమీ మారలేదు
అతని సేద్యం ఎప్పట్లాగే దుర్భరంగానే వుంది



బోడో మూలం: ఉత్రిసర్ ఖుంగుర్ బసుమతరి
ఆంగ్లానువాదం : శిఖ్నా జాన్ బసుమతరి
తెలుగు సేత: దర్భశయనం శ్రీనివాసాచార్య



# శాంతి సౌరభం

గుండెల్లో గూడు కట్టిన
గాయాల మధ్య,
ప్రేమ పావురంలా
ఎగరాలి శాంతి
యుద్ధకడలి అలల్లో
కలిసిన కన్నీటి ధారలు,
మానవత్వం తీరంలో
సమైక్యంగా మారాలి

కత్తుల కీచులాటలు
మౌనంగా మారిన రోజు,
రక్తపు గాండ్రింపులు
పూలమాలలైన రోజు,
భేదాలను బంధాలుగా
మలిచే శాంతి,
ప్రతి గుండెలో
తీయనిస్వరమై
మధురగీతమవ్వాలి.

అణువుల విస్ఫోటం
నిశ్శబ్దంలో అణిగి,
అహంకార అహం
మైనంలా కరిగి,
సమస్త జీవరాశుల
సౌందర్య గీతంలో,
శాంతి ఒక స్వర్గ
సౌరభంగా విరజిమ్మాలి.

మతాల గీతలు,
భాషల సరిహద్దులు,



కులాల కాష్టాలు
కాలిపోయిన చోట,
మానవుడు మానవుడిగా కలిసే
ఆ క్షణం,
శాంతి పరిమళం ప్రపంచ
మంతా వ్యాపించాలి.

ఓ శాంతి! నీవు కేవలం
కల కాదు,
ప్రతి ఊపిరిలో నీవు
సత్యమవ్వాలి.
ఒక్కొక్కరి గుండెలో
దీపం వెలిగితే,
ప్రపంచమే నీ చల్లటినీడలో
శాంతిమయమవుతుంది.
ఎన్ని వున్నా నీవు లేని ఇల్లు
ఎన్ని వున్నా నీవు లేని ప్రపంచం
ఎవరు కోరుకుంటారు..?

ఓ దేవుడా! నాకేమీ వద్దు.
శాంతిని ఇవ్వు చాలు..!
ఏ యుద్ధాలు..
అంతర్యుద్ధాలు లేని
ప్రశాంతత ఇవ్వు చాలు.. !!

(డా.వి. వి శోభ స్మారక కవితల పోటీలో తృతీయ బహుమతి పొందిన కవిత)

ఎన్. లహరి
9885535506

# ఆవు గోమాత.. బర్రె పాలమాత

భిన్న అంశాలపై కథలు రాస్తూనే తెలంగాణ అస్తిత్వానికి, జీవితానికి, గ్రామీణ పరిస్థితులకు తెలుగు కథా సాహిత్యంలో ప్రత్యేక స్థానం కల్పించిన రచయితల్లో కె వి నరేందర్ ఒకరు. యథార్థ సంఘటనలకు తనదైన కల్పన జోడించి మనసుకు తాకే ముగింపుతో కథలల్లడం ఆయన ప్రత్యేకత. నవ్య కథాంశాలను వెదికి వాటికి అక్షర రూపమీయడం ఆయనకు ఇష్టం. ఎవరు పట్టించుకోని వెంట్రుక, చెత్తలో మెదిలే చీపురు కూడా ఆయన కథా వస్తువులు అయ్యాయి. తెలుగు పత్రికల్లో తెలంగాణ ప్రాంత రచయితలకు తగిన గుర్తింపులేని కాలంలోనే నరేందర్ కథారచయితగా నిలదొక్కుకోవడం ఆయనకున్న ప్రతిభ వల్లే సాధ్యపడింది. పుట్టి నూరు జగిత్యాల దాటకుండానే కథలు సంధించి పత్రికల, పాఠకుల ఆదరణతో రచయితగా తన ఉనికిని చాటుకున్నారు. తెలుగులో వార, మాస పత్రికలు సమృద్ధిగా ఉన్న రోజుల్లో సుమారు రెండు దశాబ్దాల పాటు నిరంతరంగా అన్ని పత్రికల్లో కథకుడిగా ఆయన పేరు కనబడేది.

గత కొంతకాలంగా అనారోగ్య కారణంగా నరేందర్ రచనలకు దూరమయ్యారు. పార్కిన్సన్ వ్యాధి ఆయన కలాన్ని కదలనీయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో శక్తి కూడగట్టుకొని ఆయన ఇటీవల 'బర్రె' అనే నవలిక రాశారు. ఇది ఆయన అప్పటికే రాసిన బర్రె కథకు పొడగింపు లేదా సమగ్ర రూపం అనవచ్చు. పత్రికలో ఆ కథ వచ్చినప్పుడు ఒక మూగ జీవి వేదనను బాగా చెప్పారని పాఠకులు ప్రశంసలు కురిపించారు. పత్రికలో ఇచ్చే పరిమిత నిడివిలోనే కథ రాయాలి కాబట్టి దాన్ని అంతటితో ముగించినా నరేందర్ మనసులో మాత్రం బర్రెకు చెందిన




బర్రె (నవల)
రచన : కె వి నరేందర్
పేజీలు 104 . ధర రూ. 200/-
ప్రతులకు రచయిత
9440402871

ఎన్నో విషయాలు మిగిలిపోయాయి. వాటి చేర్పు, కూర్పుల ద్వారా ఈ నవలిక రూపం దాల్చింది.

ఇంట్లో బర్రె ఉండగానే దాని కష్టాలు తెలిసినట్లు కాదు. వాటిని రోజు పరిశీలించే వారికే అది సాధ్యం. మూగజీవాలు వ్యక్తపరిచే భావాలను పసిగట్టేందుకు భూతదయ గల చూపులు కావాలి. ఆ మనోనేత్రమున్న నరేందర్ వాటికీ కష్టాలు, కన్నీళ్లు ఉంటాయని గ్రహించాడు. తెల్లని పాలిచ్చే నల్లని బర్రె బతుకంతా వివక్ష, నిర్లక్ష్యమయ చీకటే అని ఆ సాధుజంతువు స్వగతంగా ఇందులో పొందుపరచారు. పాలు ఇవ్వని బర్రెను వధ్యశాల అల్ కబీర్ కు చేరడం వాటి బతుకు ముగిసే ప్రక్రియ. 'ఎనిమిది ఈతల బర్రె.. ఏమున్నది దీంట్లో.. ఆరు వందలిస్తా..' అని బేరగాడి మాటతోనే పాలు తాగిన, అమ్ముకొని బతికిన యజమానితో బర్రెకు తనుగు బంధం తెగిపోయింది. అక్కడి నుండి ఆ బర్రె చేసే పాదయాత్రలో ఎదురయ్యే సంఘటనలు , సందర్భాల ఆధారంగా కథ నడుస్తుంది.

జనం దృష్టిలో, వారి ఆచార సంప్రదాయాల్లో బర్రెకు, ఆవుకు మధ్య చూపే వ్యత్యాసాన్ని రచయిత ఇందులో తీవ్రంగా పరిగణించారు. ఈ రచన ప్రధానంగా ఆ వివక్ష ఎందుకు అనే కోణంలోనే సాగుతుంది. బర్రె, ఆవులను పోల్చుతూ అవి మనిషికి చేసే సేవలను వివరిస్తూ ఆవు బర్రె కన్నా గొప్పదెలా అవుతుంది అనే ప్రశ్నలను బర్రె ముఖంగా సంధిస్తారు. నలుపుగా పుట్టడమే తమ పాపమా అని పలుసార్లు అది వేదన పడుతుంది. ఆవు మూత్రం ఆరోగ్యం, ఆవు పేడ మహాభాగ్యం అంటూ మనుషులు కమర్షియల్ గా మారి గృహప్రవేశాల్లో ఆవును తిప్పి సొమ్ము చేసుకుంటున్నారు, బర్రెను మాత్రం చీదరించుకుంటున్నారు అని మనుషుల వైఖరిని తిట్టి పోస్తుంది.

బర్రె పాద యాత్రలో పోతురాజు అని గౌరవం పొందిన దున్నపోతు చివరి రోజుల దీన స్థితి, ఆవుదూడకు బారసాల తంతు, ఎర్రావు కథ, కర్రావు కథ, గంగిరెద్దు పరిస్థితి కథలో భాగమౌతాయి. చివరలో ఓ గోమాత విగ్రహ ఆవిష్కరణ సభలో బర్రె పాల్గొంటుంది. సభ వేదిక నుండి వినిపిస్తున్న 'సకల పాపాల పరిహారం మన గోమాత' లాంటి మాటలకు బర్రెకు చిర్రెత్తుతుంది. పట్టలేని కోపంతో బర్రె ఏం చేస్తుంది అనేదే ముగింపు. బర్రె స్వీయ అనుభవాల, దానికి ఎదురయ్యే ఇతర జంతువుల వ్యధలతో కూడిన చిన్న కథల సమాహారంగా సాగే ఈ నవలలో మనిషే విలన్. తన స్తన్యంతో మానవ జాతిని పెంచి పోషించిన బర్రె పాలింకి పోగానే కసాయికి బలవుతుంది. అదే రంగు పాలిచ్చే ఆవు చివరి దశలో గోశాలకు చేరుతుంది. ఈ భేదం ఎందుకు అని నవలంతా బర్రె ఆవేదన పడుతుంది, ఆవేశం చెందుతుంది. బహుశ ఇది సమాజానికి రచయిత వేసే ప్రశ్న కూడా కావచ్చు.



బి.నర్సన్
9440128169



# జాతీయం-అంతర్జాతీయం



## పార్టీ వీడిన రాజ్యసభ ఎంపిలపై
# అనర్హత వేటు వేయాలి: ఆప్





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (వుదయం) :**

ఇటీవలే పార్టీ నుంచి నిష్క్రమించిన రాఘవ్ చద్దాతో సహా ఏడుగురు రాజ్యసభ ఎంపీలను ఫిరాయింపుల నిరోధక చట్టాల కింద అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ తన చర్యలను తీవ్రతరం చేసింది. రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతికి అధికారికంగా ఒక వినతిపత్రం సమర్పించినట్లు సీనియర్ నాయకుడు సంజయ్ సింగ్ ధృవీకరించారు. ఈ ఎంపీలు బీజేపీలోకి ఫిరాయించడంతో, రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద నిబంధనలు వర్తిస్తాయన్న వ్యాఖ్యానాల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు.

**ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ప్రయోగిస్తున్న ఆప్**

ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సంజయ్ సింగ్ మాట్లాడుతూ, ఆ ఏడుగురు ఎంపీలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని రాజ్యాంగ నిపుణులు స్పష్టంగా సూచించారని తెలిపారు. బీజేపీలో విలీనమవ్వాలన్న ఆ ఎంపీల నిర్ణయం ఫిరాయింపుల నిరోధక నిబంధనలను ఉల్లంఘిస్తుందని భావిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచార్య తదితరుల అభిప్రాయాలను ఆయన ఉటంకించారు. ఆప్ నుండి విడిపోయిన ఆ ఏడుగురు సభ్యుల రాజ్యసభ సభ్యత్వం రద్దవుతుందని సింగ్ స్పష్టం చేశారు. ఇటువంటి సందర్భాలలో రాజ్యాంగపరమైన నిబంధనలలో ఎటువంటి సందిగ్ధతకూ తావు లేదని ఆయన నొక్కిచెప్పారు. తద్వారా కఠిన చర్యలు తీసుకోవాలన్న పార్టీ డిమాండ్‌ను ఆయన మరింత బలపరిచారు.

**సత్వర చర్యకు పిలుపు**

న్యాయ నిపుణులను సంప్రదించి, వారి అభిప్రాయాలను పొందుపరిచిన తర్వాత, పదవ షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకుని, ఎంపీల సభ్యత్వాలను పూర్తిగా రద్దు చేయాలని తాను ఉపరాష్ట్రపతిని లాంఛనంగా కోరినట్లు సింగ్ తెలిపారు. ఈ విషయంపై త్వరితగతిన విచారణ జరిపి, న్యాయమైన, చట్టబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.

కేసు త్వరగా పరిష్కారమవుతుందా అనే ప్రశ్నలకు సమాధానమిస్తూ, గతంలో ఇలాంటి కేసులలో జాప్యం జరిగిందని సింగ్ అంగీకరించారు. అయితే, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో రాజకీయ సంక్షోభాల వంటి పూర్వ ఉదాహరణలను ఆయన ప్రస్తావించారు, అక్కడ న్యాయ జోక్యం అంతిమంగా వివాదాలను పరిష్కరించింది. జాప్యం నిరాశ కలిగించినప్పటికీ, అవసరమైతే ఈ విషయాన్ని చట్టపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగానిదే పై చేయి కావాలి, దాని నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయి, అని సింగ్ అన్నారు. ఈ పోరాటాన్ని తార్కిక ముగింపునకు తీసుకెళ్లాలన్న ఆప్ ఉద్దేశాన్ని ఆయన నొక్కి చెప్పారు.

## ఉగ్రదాడులతో మాలి అతలాకుతలం
# రక్షణ మంత్రి హతం



**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :**

పశ్చిమాసియాలో చాలదన్నట్టుగా ఆఫ్రికాలోని మాలిలో కూడా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థలు, టువారెగ్ తిరుగుబాటుదారులు దేశంలోని పలు ప్రాంతాలపై ఒకేసారి ఉగ్రదాడులకు పాల్పడ్డారు. ఈ దాడులలో ఆ దేశ రక్షణ మంత్రి సాడియో కామారా మరణించారు. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో భారీ పేలుళ్లు సంభవించాయి. ఇటీవలి సంవత్సరాలలో జరిగిన భారీ ఉగ్రదాడిగా దీనిని పేర్కొంటున్నారు.

మాలి రక్షణ మంత్రి సాడియో కామారా నివసించే కాటి సైనిక స్థావరంపై జెఎన్ఐఎం మిలిటెంట్లు దాడి చేశారని ఫ్రెంచ్ రేడియో స్టేషన్ ఆర్ఎఫ్ఐ నివేదించింది . ఆయన ఇంటిపై చేసిన దాడిలో ఆయన మరణించినట్లు వెల్లడించింది. శనివారం మొదలైన దాడులు ఆదివారం కూడా కొనసాగాయి. రాజధాని బమాకోలోని ఒక సైనిక స్థావరం వద్ద కూడా దాడి జరిగింది. మాలిలో ఉత్తరాన ఉన్న కిడాల్ నగరంలో చాలా కాలంగా ప్రభుత్వం, తిరుగుబాటుదారులకు పోరాటం జరుగుతోంది. అయితే, తాజా దాడుల తర్వాత ప్రభుత్వం నుంచి ఈ నగరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తిరుగుబాటుదారులు ప్రకటించుకున్నారు.

ఈ దాడులపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో మరణాల సంఖ్యపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇన్నాళ్లు మారుమూల గ్రామాలను లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాదులు, ఈసారి ఏకంగా రాజధాని బమాకోలోని సైనిక స్థావరాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నారు. దాడిలో రక్షణ మంత్రిని హతం చేశారు. ఒకేసారి పలు ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. మాలిలో ప్రస్తుతం సైనిక ప్రభుత్వం ఉంది. మరోవైపు అల్ ఖైదా అనుబంధ ఉగ్ర సంస్థ జేఎన్ఐఎం, ఉత్తర మాలిలో తమ సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని టువారెగ్ తిరుగుబాటుదారులు దాడులు చేస్తున్నారు.

## ప్రాంతీయ స్థిరత్వంపై యూఏఈ అధ్యక్షుడితో
# ఎన్ఎస్ఏ అజిత్ దోవల్ చర్చ

**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :**



భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను శనివారం అబుదాబిలో కలిశారు. ఈ సమావేశంలో ఇరుపక్షాలు ప్రాంతీయ స్థిరత్వం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై చర్చించారని అల్‌జజీరా పేర్కొంది. ఇజ్రాయెల్ఇరాన్ యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఈ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య భద్రతాపరమైన ఆందోళనలు, ఆర్థిక ప్రయోజనాలు, సమన్వయంపై ఈ సమావేశం దృష్టి సారించింది.

గల్ఫ్ దేశాలతో సంబంధాల విస్తరణలో భాగంగా దోవల్ ఏప్రిల్ 20న సౌదీ అరేబియాను సందర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పర్యటనలో, ఇంధన, విదేశాంగ శాఖ మంత్రులతో పాటు భద్రతా అధికారులతో సహా సౌదీ అగ్ర నాయకత్వంతో ఆయన సమావేశమయ్యారు.

వివిధ మంత్రిత్వ శాఖల మధ్య జరిగిన ఒక సమావేశంలో, సౌదీ ఇంధన మంత్రి, విదేశాంగ మంత్రి, ఆ దేశ భద్రతా విభాగపు అధిపతితో దోవల్ ఉన్నత స్థాయి చర్చలు జరిపినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధృవీకరించారు.

ప్రధానమంత్రి ఆదేశాల మేరకు, గల్ఫ్ దేశాలతో మా సంప్రదింపులు కొనసాగుతున్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఏప్రిల్ 19న సౌదీ అరేబియాలో అధికారిక పర్యటన జరిపారు. తన పర్యటనలో భాగంగా, ఆయన సౌదీ అరేబియా ఇంధన శాఖ మంత్రి, విదేశాంగ మంత్రిలతో పాటు అక్కడి భద్రతా సలహాదారుతో సమావేశాలు నిర్వహించారు. ప్రాంతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ సమావేశాలు ఎంతగానో దోహదపడ్డాయి, అని జైస్వాల్ పేర్కొన్నారు.

ఈ చర్చలను ప్రాంతీయ అస్థిరతపై కీలకమైన అభిప్రాయాల మార్పిడిగా, ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేసే దిశలో ఒక అడుగుగా అభివర్ణించారు. ప్రపంచ వాణిజ్య మార్గాలకు ముప్పు ఉన్నప్పటికీ స్థిరమైన సరఫరా లంకెలను నిర్ధారించడం, హోర్ముజ్ జలసంధి, విస్తృత పర్షియన్ గల్ఫ్‌లోని ఆందోళనలను పరిష్కరించడం, నిఘా సమాచార మార్పిడి, సమన్వయాన్ని పెంపొందించడం, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం వంటి భారత్‌సౌదీ సంబంధానికి అత్యంత అవసరమైన నాలుగు కీలక స్తంభాలపై ఈ చర్చలు దృష్టి సారించాయి.

లెబనాన్, సిరియా, యెమెన్‌లపై ప్రాంతీయ పరిణామాలు ప్రభావం చూపుతున్నప్పటికీ, భారతదేశం ఒక సంయమనంతో కూడిన దౌత్య వైఖరిని కొనసాగిస్తోంది. ఈ సంఘర్షణ నౌకా రవాణా మార్గాలకు అంతరాయం కలిగించి, మానవతాపరమైన ఆందోళనలను రేకెత్తించినప్పటికీ, పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా నివారించడానికి, యుద్ధంలో పాల్గొంటున్న అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, సంఘర్షణ ప్రాంతాల్లోని పౌరులకు రక్షణ కల్పించాలని, మరియు చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని న్యూఢిల్లీ వాదిస్తూనే ఉంది.

గల్ఫ్‌లో లక్షలాది మంది భారతీయ ప్రవాసులు నివసిస్తున్నందున, ఇంధన దిగుమతుల కోసం ఆ ప్రాంతంపై ఎక్కువగా ఆధారపడి ఉన్నందున, ఈ భౌగోళిక రాజకీయ పునరేకీకరణ కాలంలో భారతదేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించడానికి ఇజ్రాయెల్, పాలస్తీనా, ఇరాన్‌తో సహా భాగస్వాములతో చురుకైన సంప్రదింపులు అవసరమని విదేశాంగ మంత్రిత్వ శాఖ నొక్కి చెప్పింది.

# దర్యాప్తుకు ఇబ్బందిగా మారిన టీసీఎస్ నాసిక్ ప్రధాన నిందితుడి పాస్‌వర్డ్‌లు



**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :**

నాసిక్ టీసీఎస్‌లో లైంగిక వేధింపుల కేసు విచారణకు సంబంధించి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన నిందితుడి ఫైల్స్, ఫోన్ దర్యాప్తునకు ప్రధాన ఆటంకంగా మారాయి. ప్రతి దానికి అతడు పాస్‌వర్డ్‌లు పెట్టడంతో వాటిని ఓపెన్ చేయడం సవాల్‌గా మారింది. దీంతో నిందితుడిని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నాసిక్‌లోని రీజనల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. "డిజిటల్ ఆధారాలను సంపాదించడంలో దర్యాప్తు బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా వరకు ఎలక్ట్రానిక్ పరికరాలకు పలు పాస్‌వర్డ్‌లు ఉన్నాయి. దీంతో వాటిని యాక్సెస్ చేయడానికి ఫోరెన్సిక్ సహాయం కోరాము" అని ఏసీపీ సందీప్ మిట్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని నాసిక్ టీసీఎస్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, మతమార్పిడికి ఒత్తిళ్ల కేసులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితురాళ్లు పోలీసుల విచారణలో వెల్లడిస్తున్న వివరాలు అక్కడ కొనసాగిన కీచకపర్వాన్ని బట్టబయలు చేస్తున్నాయి. హిందూ మతంతో పాటు, దేవుళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, తమతో అసభ్యకరంగా ప్రవర్తించడం, బురఖా ధరించాలని ఒత్తిడి చేయడం.. ఇలా నిందితుల నుంచి తమకు అనేక రకాలుగా వేధింపులు ఎదురైనట్లు బాధితురాళ్లు చెబుతున్నారు. గతేడాది వివాహం చేసుకొని టీసీఎస్‌లో చేరిన ఓ బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలు బయటికొచ్చాయి. దీనిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా తీవ్రంగా స్పందించారు. నిందితులను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు.

# రష్యా ఎరువుల కేంద్రంపై ఉక్రెయిన్ దాడి

**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :** వాయవ్య రష్యాలో కీలకమైన ఎరువుల ప్లాంట్ 'ఫోస్ అగ్రో'పై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఏప్రిల్ నెలలో ఈ ప్లాంట్‌పై జరిగిన రెండో దాడి ఇది. రష్యా కీలక ఎగుమతి కేంద్రాలపై ఇటీవల కాలంలో ఉక్రెయిన్ దాడులు తీవ్రమయ్యాయి. ఈ ప్లాంట్‌లోని సల్ఫ్యూరిక్ యాసిడ్ పంప్ చేసే హై ప్రెజర్ పైప్‌లైన్లను ఈ డ్రోన్లు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని వోలోగ్డా గవర్నర్ జార్జి ఫిలిమోనోవ్ ధ్రువీకరించారు. కాకపోతే ఎటువంటి మంటలు లేదా లీకేజీకి ఈ దాడి కారణం కాలేదని వెల్లడించారు. పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో ప్రమాదకర గ్యాస్‌లు కూడా ఏమీ లీక్ కాలేదని చెప్పారు. 'ఫోస్ అగ్రో' ప్రతినిధి మాత్రం ఈ దాడిపై స్పందించేందుకు నిరాకరించారు. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయిలో ఉండటంతో నైట్రోజన్ ఫర్టిలైజర్స్ ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు రష్యా, చైనా దేశాలు వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి ఫాస్ఫరస్ ఆధారిత ఎరువులను భారత్‌కు ఎగుమతి చేసే కంపెనీల్లో ఇది కూడా ఉంది.



# నిజమైన కరోలిన్ మాటలు




**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :** వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమంలో కాల్పులు కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కొన్ని గంటల ముందు ఓ మీడియా సంస్థతో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ చేసిన సరదా వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. అధ్యక్షుడు ట్రంప్ చేసే ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ.. ఈ రాత్రి కొన్ని తూటాలు పేలనున్నాయంటూ వ్యాఖ్యానించారు. చివరకు నిజంగానే అక్కడ కాల్పులు జరగడంతో ఆమె వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. "ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రానున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనదైన శైలిలో ప్రసంగిస్తారు. చాలా ఫన్నీగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. సమావేశ మందిరంలో మాటల తూటాలు పేలుతాయి. చూస్తూనే ఉండండి. నేనూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. పదునైన రాజకీయ పదజాలంతో ట్రంప్ ప్రసంగం ఉంటుందనే ఉద్దేశంతో ఆమె ఇలా సరదాగా చెప్పారు. కానీ, కొన్ని గంటల్లోనే ఆ ప్రాంగణంలోకి ప్రవేశించిన ఓ సాయుధ దుండగుడు కాల్పులు జరిపి హంగామా సృష్టించడం గమనార్హం.

# టేకాఫ్ అవుతుండగా.. విమానంలో మంటలు..

**వుదయం డెస్క్, ఏప్రిల్ 26:** టేకాఫ్ అవుతుండగా విమానం ఇంజిన్‌లో సమస్య తలెత్తడం తో మంటలు చెలరేగిన ఘటన దిల్లీ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయాలపాలైన ఆరుగురు ప్రయాణికులను అధికారులు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం తెల్లవారుజామున దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి స్విస్ విమానం స్విట్జర్‌ల్యాండ్‌లోని జ్యూరిచ్‌కు బయల్దేరడానికి సిద్ధమైంది. టేకాఫ్ అవుతున్న సమయంలో విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే విమానాన్ని నిలిపివేసి ప్రయాణికులను కిందకు దించేశారు.

అత్యవసర స్లైడ్‌లను ఉపయోగించి ప్రయాణికులను కిందకు దించుతున్న సమయంలో ఆరుగురు గాయపడినట్లు అధికారులు పేర్కొన్నారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఘటన సమయంలో విమానంలో సిబ్బంది సహా 232 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిపారు. ప్రయాణికులకు వసతి ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలోనే మరో విమానంలో వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.




# ఓ పక్క కాల్పులు.. మరోవైపు మద్యం సీసాలతో జర్నలిస్టుల నిష్క్రమణ



**వుదయం డెస్క్, ఏప్రిల్ 26 :**

కోడిగుడ్లు.. మద్యం లారీలు బోల్తాపడిన వేళల్లో దారినపోయేవారు చేతికందినవి తీసుకుపోవడం మనం తరచూ చూస్తూనే ఉంటాము. ఇలాంటి వాటికి అమెరికా కూడా అతీతమేమీ కాదు. అక్కడ శ్వేతసౌధం ఏర్పాటు చేసిన పార్టీలో ఈ పరిస్థితి తలెత్తింది. ఓ పక్క ట్రంప్ ఏర్పాటు చేసిన డిన్నర్‌లో కాల్పుల చప్పుడు.. మరో వైపు పార్టీ నుంచి ప్రాణభయంతో పారిపోతున్న అతిథులు. కొందరు మీడియా ప్రతినిధులకు అక్కడున్న ఖరీదైన మద్యం సీసాలను వదిలిపెట్టి వెళ్లబుద్ధి కాలేదు.. దీంతో కొందరు అక్కడే గ్లాసుల్లో ఉన్న మద్యం తాగేసి వెళ్లే ప్రయత్నం చేయగా, మరికొందరు చేతికి దొరికిన బాటిల్ ఎత్తుకెళ్లిపోయారు. ఇప్పుడా వీడియోలు వైరల్‌గా మారాయి..! వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ సమావేశంలో కాల్పుల వేళ ఈ సన్నివేశం వైరల్‌గా మారింది. ఓ పక్క భద్రతా సిబ్బంది ప్రాంగణం మొత్తాన్ని జల్లెడపట్టే పనిలో ఉంటే.. కొందరు మీడియా ప్రతినిధులు మాత్రం తాపీగా తమకు నచ్చిన వైన్ బాటిల్స్‌ను చంకన పెట్టుకొని వెళ్లిపోయారు. మరికొందరు మాత్రం అక్కడేమీ జరగనట్లు ఉల్లాసంగా అక్కడే సెల్ఫీలు తీసుకొంటూ కనిపించారు. నల్లటి డ్రెస్‌లోని ఓ మహిళ అక్కడికి వచ్చి ఒకటి కాదు.. ఏకంగా రెండు బాటిల్స్ మద్యాన్ని తీసుకొని వెళ్లిపోయింది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఈ వీడియోలు వైరల్‌గా మారాయి.



# ప్రసిద్ధ ఫోటోగ్రాఫర్ రఘురాయ్ మృతి



**వుదయం డెస్క్, ఏప్రిల్ 26:**

కొందరు చరిత్రను నమోదు చేస్తారు. మరికొందరు ఒక దేశం తనను తాను చూసుకునేందుకు సహాయపడతారు. రఘు రాయ్ రెండో కోవకు చెందినవారు. భారతదేశంలోని ఎన్నో భావాలను, క్షణాలను తన చిత్రాలతో బంధించిన ఆ ప్రఖ్యాత ఫోటో జర్నలిస్ట్ 83 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఆయన ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

తన తండ్రి వయసు సంబంధిత ఆరోగ్య సమస్యలతో పాటు క్యాన్సర్‌తోనూ పోరాడుతున్నారని ఆయన కుమారుడు, ఫొటోగ్రాఫర్ నితిన్ రాయ్ తెలిపారు.

**అనారోగ్యానికి గల కారణాన్ని ధృవీకరించిన కుటుంబం**

రెండేళ్ల క్రితం నాన్నకు ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది, కానీ ఆయన దాని నుంచి కోలుకున్నారు. ఆ తర్వాత అది కడుపుకు పాకింది, దానికి కూడా చికిత్స తీసుకుని ఆయన నయమయ్యారు. ఇటీవల, ఆ క్యాన్సర్ ఆయన మెదడుకు పాకింది; అంతేకాకుండా, వయసు సంబంధిత అనారోగ్య సమస్యలు కూడా తోడయ్యాయి," అని వార్తా సంస్థ పిటిఐకి నితిన్ రాయ్ తెలిపారు. రాయ్ కు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నాయి. ఆయన భార్య గుర్మీత్.

**భారత్‌ను తన చిత్రాల్లో బంధించిన వ్యక్తి**

రఘు రాయ్ భారతదేశపు అత్యంత ప్రభావవంతమైన ఛాయాచిత్రకారులలో ఒకరిగా ప్రఖ్యాతి చెందారు. దశాబ్దాలుగా, ఆయన కెమెరా దేశంలోని అన్ని వైరుధ్యాలను, సాధారణ జీవితాలను, రాజకీయ మార్పులను, సామాజిక పరివర్తనలను, దేశాన్ని నిర్వచించే ఘట్టాలను నమోదు చేసింది.

1980వ దశకంలో ఇండియా టుడే పత్రికతో ఆయనకు ఒక చిరస్మరణీయమైన, అత్యంత ప్రభావవంతమైన అనుబంధం కూడా ఉంది, అక్కడ ఆయన దృశ్య కథనం పాఠకులపై చెరగని ముద్ర వేసింది.

**ఆయన ప్రస్థానం ఎలా మొదలైంది**

రాయ్ 1965లో, 23 ఏళ్ల వయసులో ఫోటోగ్రఫీని చేపట్టారు. కేవలం ఒక సంవత్సరం తర్వాత, ఆయన ది స్టేట్స్‌మ్యాన్ వార్తాపత్రికలో చీఫ్ ఫోటోగ్రాఫర్‌గా చేరి, దాదాపు ఒక దశాబ్దం పాటు అక్కడే పనిచేశారు.

ఆ తర్వాత, ఆయన కోల్‌కతాలో ప్రచురితమయ్యే ఒక వారపత్రికలో పిక్చర్ ఎడిటర్‌గా పనిచేశారు. తక్షణమే గుర్తించగలిగే తన శైలిని మరింత మెరుగుపరుచుకున్నారు. 1971లో, దిగ్గజ ఛాయాగ్రాహకుడు హెన్రీ కార్టియర్‌బ్రెసన్, రాయ్ పనిని గమనించి, ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన ఫోటోగ్రాఫిక్ సహకార సంస్థలలో ఒకటైన మాగ్నమ్ ఫోటోస్‌కు ఆయనను నామినేట్ చేశారు. ఆ గుర్తింపు రాయ్‌ను తన తరం వారిలో అత్యంత ప్రశంసలు పొందిన చిత్రకారులలో ఒకరిగా నిలబెట్టింది.









# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## కలెక్టరేట్లో భారత జనగణన 2027 స్వీయ గణనపై అవగాహన



**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**
**వరంగల్ జిల్లా**
**ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి):**

భారత జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు టి.పి.టి (ప్రజెంటేషన్) ద్వారా స్వీయ గణన విధానంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా నిర్వహించబడే జనగణనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఈసారి స్వీయ గణన విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలు తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. ఇది పారదర్శకతను పెంపొందించడమే కాకుండా, సమయాన్ని ఆదా చేస్తుందని తెలిపారు. స్వీయ గణన ప్రక్రియలో ప్రతి కుటుంబం తమకు సంబంధించిన ప్రాథమిక వివరాలు, సభ్యుల సమాచారం, విద్య, ఉపాధి, నివాస స్థితి వంటి అంశాలను ఖచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈ ప్రక్రియలో
తప్పులేని సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వానికి సరైన ప్రణాళికలు రూపొందించేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరిన కలెక్టర్, ప్రతి ఒక్కరూ స్వీయ గణనలో చురుకుగా పాల్గొని బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అధికారులు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవసరమైన సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారులు, గణాంక విభాగం సిబ్బంది, ఐటి శాఖ ప్రతినిధులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం స్వీయ గణనలో పాల్గొనాలి

**– కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**
**సూర్యాపేట, ఏప్రిల్ 26(వుదయం)**




జనగణన-2027లోభాగంగా ప్రారంభమైన స్వీయ గణన ప్రక్రియలో ప్రతి కుటుంబం తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా ఆన్లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు.ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన
కొనసాగుతుందని, ప్రజలు అధికారిక వెబ్ పోర్టల్‌లో మొబైల్ నంబర్, ద్వారా లాగిన్ అయి తమ నివాస స్థలం, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. నమోదు అనంతరం లభించే భద్రపరచుకోవాలని తెలిపారు.స్వీయ గణన చేసినప్పటికీ ఎన్యూమరేటర్ గృహ సందర్శన చేసి వివరాలను ధృవీకరిస్తారని, అవసరమైతే సవరణలు చేసి తుది సమర్పణ చేస్తారని చెప్పారు. స్వీయ గణన చేయని కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేస్తారని తెలిపారు. ప్రజలు తమ ప్రస్తుత నివాస స్థలాన్ని ఖచ్చితంగా ఎంపిక చేసి, వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని
సూచిస్తూ, ఖచ్చితమైన జన గణన కోసం ప్రతి కుటుంబం సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## జనాభా లెక్కల స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
**భూపాలపల్లి ఏప్రిల్ 26**
**(వుదయం విలేకరి)**



జనాభా లెక్కల స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో స్వీయ గణన ప్రక్రియపై ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వీయ గణన ప్రక్రియ వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన జరుగుతుందిని ప్రతి ఒక్కరు తమ వివరాలను సులభంగా మీ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ముందుగా https://se.census.gov.in లింక్ ఓపెన్ చేసి Self Enumeration (HLO) Login వద్ద తెలంగాణ ఎంపిక చేసి, Captcha ఎంటర్ చేసి Verify & Proceed క్లిక్ చేయాలని తెలిపారు. తదుపరి Welcome పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాలని, ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలన్నారు. మొబైల్ కు వచ్చిన ఎంటర్ చేసి క్లిక్ చేయాలని, తరువాత మనకు నచ్చిన భాషను ఎంచుకోవాలన్నారు.జిల్లా, పట్టణం,గ్రామం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలని అన్నారు. మొబైల్ లో ఆన్ చేసి, మీ ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాలని, ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ద్వారా చెక్ చేసి చేయాలన్నారు. చేసిన తరువాత తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమ రేషన్ ఐడి వస్తుందని, దానిని స్క్రీన్‌షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచుకోవాలని
తెలిపారు. మే 11 తరువాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ సెల్ఫ్ ఎన్యూమరేటర్ ఐడి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారన్నారు.మన బాధ్యత - మన సమాచారమని ఆయన తెలిపారు.స్వయంగా నమోదు చేసి సమయాన్ని ఆదా చేసుకుందామన్నారు.దేశంలోనే అతిపెద్ద ప్రజా భాగస్వామ్య కార్యక్రమం జనాభా గణన 2027 కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జిల్లాలో స్వీయ గణన కార్యక్రమం కొనసాగుతుందని ఇందులో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పాత్రికేయులు ఈ స్వీయ గణనపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.ఇండ్ల జాబితా గణన, జనాభా గణన మొదటి దశ మే 11, 2026 నుండి జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, ప్రతి ఇంటి సమాచారం నమోదు చేయబడుతుందని, ఇంటి పరిస్థితి సౌకర్యాలు ప్రాథమిక సమాచారం సేకరించబడుతుందన్నారు.స్వీయ గణన ఆన్లైన్ పోర్టల్ se.census.gov.in వెబ్సైట్ ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే స్వీయ గణనలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సిబ్బంది వారి కుటుంబ సభ్యులు తమ వివరాలునమోదుచేసుకోవాలని సూచించారు జనగణన వల్ల ప్రతి ఒక్కరి భవిష్యత్తు కార్యచరణ విధానాలకు ఖచ్చితమైన ఆధారం, వనరుల పంపిణీ, ప్రణాళికలు, మెరుగైన సౌకర్యాలు ప్రాంతాల అభివృద్ధితో పాటు పథకాల అమలు జనాభా గణాంకాలు ద్వారా పకడ్బందీగా అమలు జరుగుతుందన్నారు. మీ సమాచారం పూర్తిగా సురక్షితంగా, జనాభా లెక్కల చట్టం 1948 ప్రకారం సమాచారం గోప్యంగా ఉంచబడుతుందన్నారు.సర్వే సిబ్బందికి ఖచ్చితమైన సంపూర్ణమైన వివరాలు ఇవ్వాలని, సమగ్ర సమాచారం భవిష్యత్తులో బాగా ఉపయోగ పడుతుందని జనాభా గణనలో గర్వంగా పాల్గొనాలని, దేశ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.జిల్లాలో జనాభా గణన కార్యక్రమం డిజిటల్ నమోదు కోసం 756 మంది ఎన్యూమరేటర్లను, 886 మంది సూపర్ వైజర్లను స నియమించి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ జవహర్, డిపిఆర్వో శ్రీనివాస్, ఆర్డిఓ హరికృష్ణ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్. మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి మాత జయంతి

**వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా అదనపు కలెక్టర్ రవి, ఆర్యవైశ్య ప్రతినిధులు**
**హనుమకొండ,**
**ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి) :**




ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవి మాత చిత్రపటానికి అదనపు కలెక్టర్ ఎన్ రవి, ఆర్యవైశ్య ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఆర్య వైశ్యులు సమాజంలో ఎన్నో రకాలైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారని అన్నారు. ఆర్యవైశ్యులు ఎంతో మహత్తరమైనటువంటి సేవా కార్యక్రమాలతో పేద కుటుంబాలకు సహాయం చేస్తుంటారని అన్నారు. ఆర్యవైశ్యులు మున్ముందు కూడా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆర్యవైశ్యులందరికీ వాసవి మాత జయంతి శుభాకాంక్షలని తెలియజేశారు.ఈ సందర్భంగా పలువురు
ఆర్యవైశ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమగ ఆరాధ్య దైవమైన వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ఆర్యవైశ్యుల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, జిల్లా యువజన క్రీడ అధికారి కొత్త ప్రశాంత్, ఆవోపా జిల్లా అధ్యక్షులు దొంతుల ఈశ్వరయ్య, కార్యదర్శి భాస్కర్ రావు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తోట సురేష్, కార్యదర్శి దొడ్డ మోహన్ రావు, వాసవి క్లబ్ అధ్యక్షులు ప్రకాష్, కోశాధికారి వీరయ్య, గంప రజిత, పోకల దేవి, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మహాసభ ప్రెసిడెంట్ అంచూరి విజయ్ కుమార్, ఏపీపీఎస్ ప్రెసిడెంట్ నాగమల్ల మధుకర్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు, పాల్గొన్నారు.

## పట్టణ కేంద్రంలో వేడుక ఫంక్షన్ హాల్ ప్రారంభం

**రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
**నల్గొండ జిల్లా వుదయం పేపర్ ఏప్రిల్ 27**



నల్లగొండ బైపాస్ రోడ్డులో మిర్యాలగూడ అద్దంకి రోడ్డు వైపు ఉన్న సాక్షి కార్యాలయం ముందు నూతనంగా ఏర్పాటు చేసిన వేడుక ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నల్లగొండ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇటువంటి ఆధునిక సౌకర్యాలతో కూడిన వేదికలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాకుండా, ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.
అభివృద్ధి మరియు ప్రజాసేవే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ప్రాంతం సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కుటుంబ సభ్యులు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు

## పేదల ఆత్మగౌరవ ప్రతీకలు 'ఇందిరమ్మ ఇండ్లు' ఎంపీ కడియం కావ్య

**ధర్మసాగర్, ఏప్రిల్ 26**
**(వుదయం ప్రతినిధి) :**



పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో లబ్ధిదారుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించిన ఎంపీ, అనంతరం కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా
ఆమె మాట్లాడుతూ..
సొంతింటి కల గత పదేళ్లుగా ఇల్లు లేక నిరుపేదలు పడ్డ ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం, ప్రతి అర్హుడికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని తెలిపారు.
ప్రభుత్వ నిబద్ధత, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
అంతకుముందు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఎంపీకి సర్పంచ్, వార్డు సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట నాగరాజు, ఉప సర్పంచ్ ప్రవీణ్, గ్రామ అధ్యక్షుడు బిక్షపతి, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్గొండజిల్లా, ఏప్రిల్26(వుదయం) :**



సరైన నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రం సమీపంలోని జి. చెన్నారం, ఎస్.ఎల్.బి.సి మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అలాగే లల్లాయిగూడ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం నాణ్యత, తాలు, తరుగు, తేమ, తూకం ప్రక్రియ, తూకం యంత్రాలు, రిజిస్టర్లు, అలాగే కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నీడ, తాగునీటి వంటి సౌకర్యాలను పరిశీలించారు. కేంద్రాల నిర్వాహకులు, రైతులతో మాట్లాడిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని సూచించారు. నాణ్యమైన ధాన్యం, నాణ్యత లేని ధాన్యాన్ని కలిపి పంపకూడదని, వేర్వేరుగా పంపించాలని తెలిపారు. ఇప్పటికైన అధికారులు తూచ తప్పక నియమాలు పాటించాలని ఆదేశించారు ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కేంద్ర ఇన్‌చార్జీలకు ఆదేశించారు.

## అమ్మవారి చిత్ర పటానికి పూలమాల వేసిన కలెక్టర్

**– ఘనంగా వాసవి మాత జయంతి ఉత్సవం**
**జనగామ, ఏప్రిల్ 26**
**(వుదయం ప్రతినిధి) :**



రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు.జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిధి గా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి అమ్మవారి చిత్ర పటానికి పూలమాల వేసి అలంకరించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి యువజన,క్రీడల అభివృద్ధి శాఖ అధికారి కోదండరాములు ,ఆర్య వైశ్య సంఘం కుల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు

## వాసవి మాత ఆలయంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు



**ఘనంగా నిర్వహించిన దేవాలయ కమిటీ.**
**వరంగల్ జిల్లా నర్సంపేట**
**వుదయం ప్రతినిధి ఏప్రిల్ 26.**

నర్సంపేట పట్టణంలోని వాసవి మాత ఆలయంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చకిలం కృష్ణమూర్తి, గర్రెపల్లి శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించినారు. ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు 108 కళశాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెరలతో పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో నిండిపోగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షులు చకిలం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి గర్నపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. సంఘ పెద్దలు శ్రీరామ్ ఈశ్వరయ్య, మాదారపు చంద్రశేఖర్, వంగటి గోవర్ధన్, ఎంవీ కృష్ణారావు, మల్యాల వినయ్ కుమార్ గుప్తా, అల్లంకిరాజు, వనమాల నగేష్, పబ్బా రమేష్, శ్రీరామ్ కిరణ్, నాగమల్ల కృష్ణమూర్తి, అంచూరి కృష్ణమూర్తి, పాలడుగుల పూర్ణచందర్, ఆలయ అర్చకులు నరసింహమూర్తి, ఆలయ గుమస్తా అనుగం రామకృష్ణ, శ్రీధర్, తదితరులు పాల్గొని
కార్యక్రమానికి మరింత శోభ తీసుకు వచ్చారు. ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను భక్తులు అభినందించారు.

## నేడు ఫర్టిలైజర్ షాపులు బంద్ పాటించాలి

**– రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలం సత్యనారాయణరెడ్డి**
**వరంగల్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి) :**




ది వరంగల్ డిస్ట్రిక్ట్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివనగర్ లోని అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో అల్ ఇండియా మరియు తెలంగాణా రాష్ట్ర అసోసియేషన్ ఇచ్చిన బంద్ కు మద్దతుగా వరంగల్,హనుమకొండ జిల్లాలోని ఫర్టిలైజర్ షాపులు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలం సత్యనారాయణ రెడ్డి డీలర్లను కోరారు.ఎరువుల సరఫరా విషయంలో పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తీర్చాలని అయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి,అనంతరం ప్రెస్ మీట్ జరుగుతుందని అయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు పల్లె రాజేందర్ రెడ్డి,గాయపు రాంచంద్రారెడ్డి,జిల్లా కోశాధికారి బి.యన్. రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ లాహోటి,అచ్చ పరమేశ్వర్,కల్చరల్ సెక్రటరీలు దేసు ప్రవీణ్, ముక్కెర యతీష్,జాయింట్ సెక్రెటరీ గోమాత సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కలెక్టర్‌గా భోర్కడే హేమంత్ సహదేవరావు బాధ్యతల స్వీకరణ



**ములుగు, ఏప్రిల్ 26**
**(వుదయం ప్రతినిధి) :**

ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా భోర్కడే హేమంత్ సహదేవరావు (IAS) ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అంతా సమన్వయంతో పనిచేసి, పారదర్శకమైన పాలనను ప్రజలకు అందించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన వెల్లడించారు. ఈ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) రాజ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు , కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని, నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**
**ఏప్రిల్ 27 వుదయం ప్రతినిధి):**



సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.
ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## డీజిల్ పెట్రోల్ కొరత లేకుండా చూడాలి: సిపిఐ



**సత్తుపల్లి ఏప్రిల్ 26**
**(వుదయం ప్రతినిధి)**

ఖమ్మం జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డీజిల్ పెట్రోల్ కొరత వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా రైతులు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతూ పెట్రోల్ బంకులు ముందుక్యూలు కడుతూ గంటల గంటలో రోజులు రోజులు పడిగాపులబడి ఇబ్బందులు పడుతున్నారని
వెంటనే పెట్రోల్ డీజిల్ కొరత తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. సత్తుపల్లిలో ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ ట్రంపు మూర్ఖపు వైఖరి కారణంగా భారతదేశం పై పై యుద్ధ ప్రభావం పడి గ్యాస్ డీజిల్ పెట్రోల్ లేక ప్రజల ఇబ్బందులు పడుతున్నారని బ్లాక్లో వేలాది రూపాయలకు అమ్ముతున్నారని వీటిని అరికట్టి ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకొని గ్యాస్ డీజిల్ పెట్రోల్ ప్రజలకు సరిపడా అందించి ఈ ఇబ్బంది నుండి కాపాడాలని దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ్యాస్ డీజిల్ పెట్రోల్ భారత్కు తీసుకురావడంలో విఫలమయ్యారని ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రజలకు కొరత లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఐకేపీ కేంద్రంలో ధాన్యం మాయం రైతుల ఆందోళన



**నల్గొండజిల్లా, ఏప్రిల్26(వుదయం) :**

నల్లగొండ మండలం మామిళ్లగూడెం ఐకేపీ కేంద్రంలో ధాన్యం మాయమవుతున్న ఘటన రైతుల్లో ఆందోళనకు దారి తీసింది.ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే దొంగతనాలకు గురవుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత



25 రోజులుగా వరుసగా ధాన్యం దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. ముఖ్యంగా మెట్టు యాదయ్యకు చెందిన వరి కుప్ప నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ధాన్యాన్ని అపహరించినట్లు వెల్లడించారు.పంటను కోసి విక్రయానికి సిద్ధం చేసిన సమయంలో ఈ ఘటనలు జరగడం తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు వాపోయారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.రాత్రి పహారా పెంచి దొంగలను పట్టుకోవాలని, ధాన్యం భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

### స్వీయ గణనలో ..

# ప్రజలు భాగస్వాములు కావాలి

### విలేకరుల సమావేశంలో కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతి ఒక్కరు తమ వివరాలను స్వయంగా నమోదు స్వీయ గణన చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో చేపడుతున్న జన గణనలో భాగంగా స్వీయ గణన కార్యక్రమంపై ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రెస్ మీట్ నిర్వహించారు. స్వీయ గణన ప్రక్రియపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వీయ గణనలో ప్రతి కుటుంబం తమ గృహానికి సంబంధించిన వివరాలను స్వయంగా ఆన్లైన్ ద్వారా ఫోన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇది సులభమైన సురక్షితమైన పారదర్శకమైన విధానమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్వీయ గణన ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు 15 రోజులపాటు కొనసాగుతుందన్నారు. జనాభా గణనలో గృహముల నివాసయోగ్య స్థితి, వసతులు మతము, షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు, కుటుంబ యజమాని పేరు త్రాగునీటి వసతి గృహ వినియోగం ఇంధనం వంటి వివరాలతో కూడిన 34 రకాల ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఈ సమాచారం దేశ ప్రగతి .అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. వెబ్ పోర్టల్ అడ్రస్ se.censes.giv.in ద్వారా ప్రజల తమ మొబైల్ నెంబర్ తో లాగిన్ అయి గృహాన్ని జియో ట్యాగ్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. నమోదు పూర్తయిన తర్వాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి జనరేట్ అవుతుందన్నారు. ప్రజలు తమ కుటుంబ వివరాలను సుమారు 15 నిమిషాల్లో నమోదు చేసి ఈ ప్రత్యేకమైన సెల్ఫ్ ఇన్వరేషన్ ఐడి పొందవచ్చన్నారు. స్వీయ గణన నమోదు అనంతరం వచ్చిన ఐడిని భద్రపరచుకొని ఇండ్ల గణన సమయంలో ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్ కు ఐడి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గృహాల జాబితా లెక్కింపు సమయం ఎన్యుమరేటర్లు సూపర్వైజర్ల ద్వారా తమ తమ కుటుంబ వివరాలనుధ్రువీకరిస్తారని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో డిజిటల్ జనగణన నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు అనుబంధ కార్యాలయాలు సంస్థల అధికారులు ఉద్యోగులు స్వీయ గణనలో పాల్గొనేలా ప్రజలు పౌరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. జిల్లాలో వివిధ శాఖల అధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులు మెడికల్ సిబ్బంది క్రీడాకారులు కళాకారులు జనాభా గణన విధులు నిర్వర్తిస్తున్న అధికారులు బ్యాంకింగ్, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, అంగన్వాడి, ఏఎన్ఎం ఆశా వర్కర్లు ప్రజలు స్వీయ గణనలో పాల్గొనేలా కృషి చేసేందుకు బాధ్యతాయుత అధికారులను నియమించామని తెలిపారు. సమాచారం గోప్యంగా భద్రపరుస్తామని.జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు నిర్భయంగా వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీవో కే.మహేశ్వర్, జిల్లా ప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి, ఎస్ఓ కిషన్ రావు, జిల్లా సెన్సెస్ ఇన్చార్జి తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా కలెక్టర్‌గా

## బాధ్యతలు స్వీకరించిన భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా భవేశ్ మిశ్రా ఆదివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముందుగా జిల్లాకు చేరుకున్న నూతన కలెక్టర్‌కు పూర్వపు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్‌లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమం లో ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా అధికారులు జీవరత్నం, డా. రాజేందర్, శ్రీనివాస్, నరసింహ రెడ్డి, దయానంద్, భోజన్న, సుధాకర్, విజయలక్ష్మి, రమణ, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గోశాలలకు పశుగ్రాసం విరాళం

### - శ్రీలక్ష్మి నరసింహా స్వామి దేవ స్థానం మాజీ చైర్మన్ అక్కినపెల్లి రాజేందర్ ఉదారత



**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):** వేసవి కాలంలో నోరు లేని మూగ జీవాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాతలు ముందుకు వచ్చి గోశాల లకు అండగా నిలవాలని ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అక్కినపెల్లి.రాజేందర్ పిలుపునిచ్చారు.ఆదివారం ధర్మపురి పట్టణంలోని శ్రీ కాళీ మాత ఆలయ గోశాలకు ఆయన సొంత ఖర్చుల తో పశుగ్రాసాన్ని విరాళంగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు, శ్రీ కాళీమాత ఆలయ పూజారి సంజీవ్ స్వామి మాట్లాడు తూ ఎండల తీవ్రత దృష్ట్యా గోశా లలో పశుగ్రాసం కొరత ఏర్పడిన విషయం తెలుసుకున్న రాజేందర్ తక్షణమే స్పందించి గ్రాసాన్ని పంపించడం అభినందనీయమన్నారు అనంతరం రాజేందర్ మాట్లాడు తూ గోసేవ చేయడం వల్ల కోటి పాపాలు తొలగిపోతాయని, పుణ్యఫలం దక్కుతుందని పేర్కొన్నారు.గోశాలలోని పశువుల సంరక్షణకు దాతలు విరివిగా సాయం చేయాలని వారు కోరారు. సాయం చేయదలచిన వారు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ కాళీమాత ఆలయంలో సంప్రదించాలని లేదా 9491018927 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

## రూ. 2 లక్షల ఎల్ ఓసి అందజేత



**కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు నివాసంలో సిర్పూర్ మండలం శివపూర్ గ్రామానికి చెందిన నన్న అంజన్న గారి కుమారుడు వరుణ్ కు హైదరాబాద్ లోని ప్రఖ్యాత నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసమై సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ ను సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు చొరవ తీసుకుని మంజూరు చేయించారు. దానికి సంబంధించిన ఎల్ ఒ సి లెటర్ను సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పీఏ పేషంట్ తల్లికి ఈ రోజు అందజేయడం జరిగింది.

## వాసవీ మాత జయంతి వేడుకలు

**ధర్మపురి,ఏప్రిల్ 26( వుదయం ప్రతినిధి):** మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి జయంతి వేడుకలను ఆదివారం వైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.వైశ్య సంఘం చైర్మన్ వావిలాల ప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్ర మంలో అమ్మవారి విగ్రహానికి శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. అనంతరం లోకకల్యాణార్థం విశేష పూజా కార్యక్రమాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సమాజ హితం కోసం వాసవీ మాత చూపిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ వేడుకల్లో వైశ్య ప్రముఖులు సాయిని శ్రీనివాస్, రాజయ్య, చంద సత్తయ్య, సత్తయ్య, గంగాధర్, మల్లికార్జున్, భూసాగర్ జగదీశ్వర్, నలుమాస్ శేఖర్, సంతోష్, సాయిని శరత్, రామ్ సాయి తదితరులు పాల్గొన్నారు.



## స్వదేశం చేరిన ఉపాధ్యాయులు



**జన్నారం, (వుదయం విలేఖరి)** ఫిన్లాండ్‌లోని ప్రపంచ స్థాయి బోధనా వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వెళ్లిన తెలంగాణ ఉపాధ్యాయుల బృందం ఐదు రోజుల అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్‌ను విజయవంతంగా పూర్తి చేసి స్వదేశం చేరుకుంది.ఈ బృందంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందారం ప్రధానోపాధ్యాయులు, జైపూర్ మండల విద్యా అధికారి బి.శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ కిష్టాపూర్ జన్నారం స్కూల్ అసిస్టెంట్ దాముక కమలాకర్, ప్రాథమిక పాఠశాల అక్కపెల్లిగూడెం జన్నారం ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ప్రాథమికోన్నత ఫిన్లాండ్‌లోని హెల్సింకిలో యూనివర్సిటీ ఆఫ్ హెల్సింకి, టీచర్ ట్రైనింగ్ స్కూల్, వొకేషనల్ & టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లను బృందం సందర్శించింది. విద్యార్థి కేంద్రీకృత బోధన, తక్కువ హోంవర్క్‌ఎక్కువ ప్రాక్టికల్స్ విధానం, ఉపాధ్యాయులకు పరిశోధ నాధారిత శిక్షణ, పాఠశాల కేంద్రీకృత కరికులం, బోధనలో ఉపాధ్యాయునికి సంపూర్ణ స్వేచ్ఛ వంటి అంశాలను లోతుగా పరిశీలించారు తక్కువ క్లాస్ రూమ్ సమయం, ఎక్కువ ఆటలుప్రాక్టికల్ లెర్నింగ్, హోంవర్క్ తక్కువ,పర్యటన అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హెల్సింకిలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగితా రానా, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి సిక్త పట్నాయక్ ఐఏఎస్, గద్వాల జిల్లా కలెక్టర్ రిజవాన్ భాషా, SCERT డైరెక్టర్ జి.రమేష్, యూనివర్సిటీ ఆఫ్ తుర్కు డాక్టర్ అరి కోస్కి, యూనివర్సిటీ ఆఫ్ హెల్సింకి CEO డాక్టర్ కిమ్మో కాపీజోకి, ప్రొఫెసర్ డాక్టర్ మిర్కా, డాక్టర్ పెట్టొరి, ప్రిన్సిపాల్ ఇక్కా లాసనేన్‌లతో చర్చించారు. పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. బోధకుల ఉన్నత శిక్షణ.ఈ అనుభవం తెలంగాణ విద్యా వ్యవస్థకు అమూల్య మార్గదర్శకంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. అంశాలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం

**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):** ధర్మపురి పురపాలక సంఘాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. ఆదివారం పట్టణంలోని 6వ వార్డు శ్రీ లక్ష్మి నరసింహ కాలనీలో, పాఠశాల సమీపంలో నూతనంగా మంజూ రైన సీసీ రోడ్డు,డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆమె కొబ్బరికాయ కొట్టి వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడు తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమా ర్ ప్రత్యేక చొరవతో పట్టణాభివృ ద్ధికి భారీగా నిధులు మంజూర య్యాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్య త ఇస్తున్నామని పేర్కొన్నారు. కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమ స్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని,నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మంత్రి సహకారం తో వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు వివరిం చారు.ప్రజలకు మెరుగైన వసతు లు కల్పించడంలో మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్య క్రమంలో స్థానిక కౌన్సిలర్లు ముదుసుల.ప్రశాంత్, వంకడోతు. విజయ్ ,మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలల్లో జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల (వుదయం ప్రతినిధి)** కోరుట్ల మండలం చిన్న మెట్పల్లి గ్రామంలో ఆదివారం కాలజ్ఞాని శ్రీశ్రీశ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాల క్రితం సమాజంలో ఏ విధమైన మార్పులు రానున్నాయి ఏ విధమైన సంఘటనలు జరగనున్నాయి అనేది ప్రజలకు తెలియజేసినది బ్రహ్మంగారు అని కృష్ణారావు అన్నారు ఆనాడు సమాజంలో ఉన్న అంటరానితనాన్ని రూపుమాపి కుల వ్యవస్థను నిర్మూలించడానికి కృషి చేశారన్నారు ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి ఆశీర్వదించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు సర్పంచ్ ఎండీ రహీం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అర్మూర్ గంగాధర్ మండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజాం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి సరికెళ్ల నరేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్

**కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )** మేడ్చల్ అర్బన్ జిల్లా: షాపూర్ నగర్ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొని ప్రసంగించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. నారీ శక్తి వందన అధినియమ్ (మహిళ రిజర్వేషన్ బిల్లు) ను అడ్డుకుని కాంగ్రెస్ మరియు దాని మిత్ర పక్షాలు తమ నిజస్వరూపాన్ని బ య ట పె ట్టు కు న్నా య ని తెలిపారు. మహిళా ద్రోహులుగా సమాజం ఎప్పటికీ వారిని గుర్తుపెట్టుకుంటుందని అన్నారు. ఏడు సార్లు ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినా అన్ని సార్లు కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు అడ్డుకుని మహిళా లోకానికి తీరని అన్యాయం చేశాయని తెలిపారు. డీలిమిటేషన్ తో చట్టసభల్లో సీట్ల పెంపు తో పాటే మహిళా రిజర్వేషన్ బిల్లు సాధ్యమవుతుందని తెలిపారు. 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేద్దామని కేంద్ర ప్రభుత్వం సంకల్పిస్తే ఈ బిల్లుకు గండికొట్టి తామేదో గొప్పలు చేశామని కాంగ్రెస్ నేతలు జబ్బలు చరుచుకుంటున్నారని తెలిపారు. జి.ఎస్.డి.పి ని ప్రామాణికంగా తీసుకొని దక్షిణాది రాష్ట్రాలకు అధిక పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు డా.ఎస్ మల్లారెడ్డి, భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అధ్యక్షులు డా.శిల్పా రెడ్డి, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి, నాయకులు సరిత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో కొత్త పార్టీలకు స్థానం లేదు

### - చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



**మంచిర్యాల /రామకృష్ణాపూర్ ఏప్రిల్ 26(వుదయం ప్రతినిధి)** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్మెన్ ఎన్నిక ఘటనలో ఆదిలాబాద్ జైలుకు వెళ్లి షరతులతో కూడిన బెయిల్ పై బయటికి వచ్చిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ లో హాజరై సంతకం చేశారు. అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ..క్యాతన పల్లి మున్సిపాలిటీ ఘటనలో బిఆర్ఎస్ నాయకులు పై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టించి జైలుకు పంపించారని స్థానిక మంత్రి వివేక్ వెంకటస్వామి పాత్ర కీలకంగా ఉందని అన్నారు. కోర్టు కండిషన్ బెయిల్ ఇవ్వడంతో ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్ లో సంతకం చేస్తున్నానని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఇప్పటికే పాలకవర్గం కొలువుదీరిందని తెలిపారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించాలని,కారుణ్య నియామకాల కోసం తీర్మానం చేయాలని ,కౌన్సిల్ సభ్యులను కోరానని తెలిపారు. జీవో 76 కింద డీడీలు కట్టిన వారందరికీ ఇండ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న అని అన్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న క్యాతన్ పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి 220 కోట్ల నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి, సంక్షేమం కోసం మేము కృషి చేస్తున్నాం అని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు పైన మంత్రి వివేక్ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. మంత్రి వివేక్ పై జనం తిరగబడుతున్నారని, నిన్న నరసాపూర్ లో ప్రజలు తిరగబడ్డారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీలు పెట్టుకోవచ్చని అన్నారు. కెసిఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా అని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ రైతుబంధు,రైతు బీమా, కళ్యాణ లక్ష్మి,మిషన్ కాకతీయ,పెన్షన్లు పెంపు, పెంచినందుకు కేసీఆర్ మర మనిషి అవుతాడా అని అన్నారు. కొత్త పార్టీ పెట్టిన వాళ్లు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం,రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి గాని,ప్రతిపక్షాన్ని తిట్టడం ఏంటని ఎద్దేవా చేశారు.తెలంగాణ కొత్తగా పార్టీ పెట్టినవారు ఏం ఆశించి పార్టీ పెట్టారో ప్రజలు ఆలోచించుకోవాలని, తెలంగాణలో కొత్త పార్టీలకు స్థానం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గోడిశెల సంధ్యారాణి, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, యూత్ నాయకులు, సీనియర్ నాయకులు, టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**జన్నారం, ఏప్రిల్ 26(వుదయం విలేఖరి)**



జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫస్సిఉల్లాహ్ ఆదివారం ప్రారంభించారు.రైతులు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజఫర్ అలీ,మేకల మాణిక్యం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న యాదవ్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, పీఏసీఎస్ అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వాసవి మాత జయంతి వేడుకలు



**జన్నారం,ఏప్రిల్ 26(వుదయం విలేఖరి)** ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీ వాసవిమాత కు ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.ఆదివారం రోజున మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ సహిత మహాలక్ష్మి దేవాలయంలో వాసవిమాత జయంతిని పురస్కరించుకొని పురోహితులు గుండి గణేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అర్చనలు,అభిషేకాలు చేశారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దీంతో ఆలయ పరిసరాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్,ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు జక్కు భూమేష్, సెక్రెటరీ గోపాలకృష్ణ,వర్తక సంఘం అధ్యక్షుడు వోజ్జల వామన్ కుమార్,ప్రధాన కార్యదర్శి జక్కు రమేష్ కోశాధికారి కొమరవెల్లి శివరామకృష్ణ,మహాలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కు సత్తయ్య,నాయకులు గుండ లచ్చన్న, గుండ సుధాకర్,కొమురవెల్లి లచ్చన్న, పద్మ నారాయణ గోలిచందు,అక్కెనపల్లి శ్రీను,నాగేష్, శ్రీహరి, వెంకటేష్, పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

**జన్నారం,ఏప్రిల్ 26(వుదయం విలేఖరి)** వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం ఆర్యవైశ్యుల చిరకాల వాంఛ అని ఆర్యవైశ్యులు అన్నారు. ఆర్యవైశ్యుల కులదైవమైన వాసవి మాత జయంతిని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగ జాబితాలో చేర్చినందుకు కృతజ్ఞతగా జన్నారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆదివారం రోజున జన్నారం పట్టణంలోని కవ్వాల్ చౌరస్తా వద్ద వారు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జక్కు భూమేష్, వర్తక సంఘం అధ్యక్షులు వోజ్జల వామన్,మండల ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నరేందుల గోపాలకృష్ణ, వర్తక సంఘం కార్యదర్శి జక్కు రమేష్,కోశాధికారి శివరామకృష్ణ,ఆర్యవైశ్య సంఘ నాయకులు సందీప్, శివకుమార్, శ్యామ్, సంతోష్, భూమేష్, గంగాధర్, సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు

**వనపర్తి ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి)**
అహింస, ఆత్మగౌరవం మరియు త్యాగనిరతికి ప్రతీకగా నిలిచిన పవిత్ర దేవతామూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కొనియాడారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వాసవి కన్యకా పరమేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే తో పాటు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ, అహింస, ఆత్మగౌరవం మరియు త్యాగనిరతికి ప్రతీకగా నిలిచిన పవిత్ర దేవతామూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత అని కొనియాడారు. వాసవి మాత సమాజానికి ధర్మం, అహింస, సత్యం వంటి గొప్ప విలువలను బోధించిన మహనీయురాలని అన్నారు. ఆమె చూపించిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించుకోవాలని, వాసవి మాత బోధనలు అందరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, వాసవి మాత జయంతి వేడుకలు సమాజంలో సత్సంకల్పాలు పెంపొందించేలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కవిత పాంచజన్యం.. సాధ్యమేనా?

**వికారాబాద్ ఏప్రిల్ 26 (వుదయం బ్యూరో)**
టీఆర్ఎస్ మాజీ నేత, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ సీఎం కేసీఆర్ ముద్దుల కూతురు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టారు. ముందుగా చెప్పినట్లే టీఆర్ఎస్(తెలంగాణ రాష్ట్ర సేన) పేరుతో పార్టీ ప్రకటించారు.మునీరాబాద్ లో నిర్వహించిన సభలో పార్టీ పేరు జెండా, ఎజెండా ప్రకటించారు. ఇదే వేదికగా శ్రీకృష్ణుడి భగవద్గీత ప్రేరణతో 'పొలిటికల్ పాంచజన్యం' పేరుతో ఐదు ముఖ్య హామీలను ప్రకటించారు.

**అందరికీ ఉచిత విద్య.**
పాంచజన్యంలో తొలి హామీగా కవిత అందరికీ ఉచిత విద్యను ప్రకటించారు. ప్రభుత్వప్రైవేటు వ్యవస్థలతో సంబంధం లేకుండా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అందరికీ ఉచిత విద్య అందిస్తామని ప్రకటించారు. ఇది తల్లిదండ్రుల భారాన్ని తగ్గించి, విద్యా ప్రవేశాన్ని సమానత్వంగా చేస్తుంది.

**ఉచిత వైద్యం..**
ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నాయి. అయితే కొన్ని వ్యాధులకే ఇది వర్తిస్తుంది. దీంతో వైద్యం ఈ రోజుల్లో భారంగా మారిన నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేలా అందరికీ, అన్ని వ్యాధులకు ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు. ఏ ఆసుపత్రిలోనైనా, ఎంతటి ఖరీదైన చికిత్స అయినా ఉచితంగా అందేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇది ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న పేదలకు గొప్ప ఆశాకిరణం.

**రైతును రాజును చేస్తాం..**
అనేక ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తున్నాయి. కేంద్రం కూడా పీఎం కిసాన్ పేరుతో ఆర్థికసాయం చేస్తుంది. అయితే కవిత ఇలా పెట్టుబడి సాయం ప్రనకటించకుండా కుల వృత్తులను కాపాడతామని, రైతుని రాజుగా మార్చుతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ సంస్కరణలు, మద్దతు ధరలు ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**యువశక్తికి ప్రాధాన్యం..**
ఇక యువతను ఆకట్టుకునేలా ఉపాధికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేలా ఎలాంటి గ్యారంటీ లేకుండా ప్రభుత్వం మే గ్యారంటీగా ఉండి రుణాలు ఇస్తామని తెలిపారు. ఇక ఉద్యోగాలు చేయదాని



కి ఒకే నోటిఫికేషన్ తో ఏడాదిలో 4 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు.

**సామాజిక న్యాయం..**
ఇక చివరి హామీగా సామాజిక న్యాయాన్ని ప్రకటించారు. అందరికీ సమన్యాయం చేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. చట్టసభల్లో మహిళలకు 50% సీట్లు, ఎస్సీ/ఎస్టీ/బీసీలతోపాటు అగ్రవర్ణ పేదలకు న్యాయం. ఇది సామాజిక సమతుల్యతను పెంచుతూ, అందరినీ కవర్ చేసే ప్రయత్నం చేశారు.

**అమ్మగా ప్రమోట్..**
తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలిగా కవిత పార్టీ ఆవిర్భావ సభలో తనను తాను అమ్మగా ప్రమోషన్ చేసుకున్నారు. ప్రతీ హామీ ముందు అమ్మగా తనకు తెలుసు.. బిడ్డల బాధ తల్లికి తెలుసు అంటూ పదే పదే మాట్లాడారు. తద్వారా తెలంగాణలో ఇకపై తనను కవితక్కగా కాకుండా కవితమ్మగా పిలిచేలా ప్రమోట్ చేసుకున్నారు. అమ్మతనంతో పనిచేస్తానని తెలిపారు.
పాంచజన్యం ఎజెండా విద్య, ఆరోగ్యం, రైతులు, యువత, సామాజిక న్యాయం అంశాలపై దృష్టి సార్వత్రికంగా ఆకట్టుకునేలా ఉంది. టీఆర్ఎస్ నుంచి విడిపోయిన కవితకు ఇది బలమైన రీఎంట్రీ స్ట్రాటజీ. అయితే, అమలు సామర్థ్యం, ఆర్థిక మూలాలు, పోటీ పార్టీల సవాళ్లు కీలకం. తెలంగాణ ఓటర్లు ఈ 'గీతా ప్రేరణ'ను ఎలా స్వీకరిస్తారో రాబోయే ఎన్నికల్లో తేలనుంది.



## రాబోయే కాలంలో ఏమి జరుగుతుందో చెప్పిన గొప్ప కాలజ్ఞాని బ్రహ్మంగారు

- **తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

**యాలాల ఏప్రిల్ 26 ఉదయం( ప్రతినిధి):-**
రాబోయే కాలంలో ఏమి జరుగుతుందో ముందుగానే చెప్పిన గొప్ప మహా కాలజ్ఞాని బ్రహ్మంగారిని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు మండల పరిధి లోని కాన్జాపూర్ గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన, మహోత్సవ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేం బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ పోతులూరి వీరబ్రహ్మం మహా గొప్ప కాలజ్ఞాని యొక్క ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. మహా జ్ఞానుల యొక్క ఆలయాలు నిర్మాణం చేపట్టడంతో ముందుతరాలకు చరిత్ర తెలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారసింగ్, తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, పెద్దముల్ మాజీ మండల పరిషత్ వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు

## అన్నదమ్ముల ఆత్మీయతకు నిలువెత్తు నిదర్శనం

**దౌల్తాబాద్, ఏప్రిల్ 26(వుదయం):**
అన్నదమ్ముల మధ్య ఉండే అనుబంధం ఎంత గొప్పదో దౌల్తాబాద్ లో జరిగిన ఒక సంఘటన స్పష్టంగా తెలియజేస్తోంది. కష్టకాలంలో ఒకరికి ఒకరు అండగా నిలబడే ఈ బంధం అందరికీ ప్రేరణగా నిలుస్తోంది.సిద్దిపేట జిల్లా కుక్కునూరు పల్లి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన బుర్రి నాగరాజు జీవితం కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంతో పూర్తిగా అభయా నీయంగా మారిపోయింది. విద్యుత్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కు గురై రెండు చేతులను కోల్పోయాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. తమ్ముడికి అవసరమైన పనులన్నీ తానే చేస్తూ, రోజువారీ జీవితంలో సహాయం అందిస్తున్నాడు.ఆదివారం ఒక వివాహ కార్యక్రమానికి దౌల్తాబాద్ కు వచ్చిన సందర్భంలో, కనకయ్య తన తమ్ముడు నాగరాజుకు స్వయంగా టీ తాగిస్తున్న దృశ్యం అక్కడ ఉన్నవారిని కదిలించింది. సాధారణంగా కనిపించినా, ఆ దృశ్యం వెనుక ఉన్న ప్రేమ, బాధ్యత అందరినీ ఆలోచింపజేసింది. గ్రామస్తులు ఈ అన్నదమ్ముల బంధాన్ని ప్రశంసిస్తూ, ఇటువంటి అనుబంధం అరుదుగా కనిపిస్తుందని తెలిపారు.



ప్రస్తుతం సమాజంలో తగ్గుతున్న మానవ విలువల మధ్య ఈ కుటుంబం చూపిస్తున్న మనసున్న తీరు ఆదర్శంగా నిలుస్తోంది.నాగరాజుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె లత పదో తరగతి పూర్తి చేసింది. కుమారుడు గౌతమ్ సాయి ఐదో తరగతి చదువుతున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా వారి చదువు కొనసాగించడం కష్టంగా మారుతోంది. సహాయం అందితే పిల్లలు మంచి చదువు కొనసాగించి భవిష్యత్తులో అన్ని విధాలుగా ఎదవలసి న అవసరం ఎంతగానో ఉంది అవకాశముంది. మానవత్వం వాదులు ముందుకు వచ్చి వారి కుటుంబానికి ఆదుకోవాలని తోటి వారు కోరుతున్నారు.ఇలాంటి కుటుంబాలకు సమాజం నుంచి సహాయం అందితే, వారి జీవితం మెరుగుపడటం తో పాటు పిల్లల భవిష్యత్తు కూడా మంచి మారుతుంది. మనమంతా ఇలాంటి సందర్భాల్లో ముందుకు రావడం సమాజానికి మంచిది.

## ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు

- **ముఖ్య అతిథిగా హాజరైన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**
- **తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ర్యాలీ**
- **కలెక్టరేట్ అధికారికంగా జయంతి కార్యక్రమం**

**సంగారెడ్డి, వుదయం :**
జిల్లా కేంద్రం సంగారెడ్డి లో వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.సంగారెడ్డి పట్టణంలో వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి కార్యక్రమం లో భాగంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొత్త బస్టాండ్ కలెక్టరేట్ మీదుగా పాత బస్టాండ్ నుంచి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. జై వాసవి జై జై వాసవి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు



సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణం చదివారు. అనంతరం అమ్మవారి పల్లకి సేవా కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య మహిళలు, సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వరి కొనుగోలు కేంద్రాలు ఎక్కడ...?

- **ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తాం...!**
- **బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి**

**నారాయణపేట , ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి):**
వరి కోతలు ప్రారంభమై నెల రోజులవుతున్న కొనుగోలు కేంద్రాలను నారాయణపేట జిల్లాలో పూర్తి స్థాయిలో నేటికి ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు నేరుగా మిల్లర్లకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించుకొని నష్టపోతున్నారని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్థాయి అధికారి సమీక్ష చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి



దాదాపు నెల రోజులు అవుతున్నా నేటికి నారాయణపేట జిల్లాలో పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఎక్కడో ఒకటి, రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతుల మీద ఎలాంటి చిత్త శుద్ధి కనిపించడం లేదన్నారు. కేంద్రాల ఏర్పాటు లో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే పలు చోట్ల రైతులు రోడ్డు ఎక్కి ఆందోళనలు చేసినా ప్రభుత్వంలో చలనం మాత్రం రావడం లేదన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి కూడా ఖరీఫ్, రబీ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కూడా మొక్కుబడిగా ఏర్పాటు చేశారని అన్నారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి జిల్లా మొత్తంలో వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేకపోతే బిఆర్ఎస్ పార్టీ తరపున రైతులకు మద్దతుగా జిల్లా పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని ఒక ప్రకటన లో హెచ్చరించారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

- **ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**దుబ్బాక, వుదయం ఏప్రిల్ (26) :**
రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి, చెప్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ మద్దతధరను పొందాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తుందని, ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే రైతు బాగుండాలని, అందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల



ద్వారా నేరుగా రైతుల నుంచి ధాన్యం సేకరిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంయుక్త , స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు , రైతులు పాల్గొన్నారు.

## సాగునీటి కాలువలు నిర్మించి వ్యవసాయానికి నీళ్లు అందించాలి



- **ఏఎంసీ చైర్మన్ కు వినతి పత్రం అందించిన పాలమాకుల రైతులు**

**నంగునూరు, ఏప్రిల్ 26 వుదయం :**
సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం పాలమాకుల గ్రామ రైతులు సాగునీటి కాలువల సమస్యలపై నంగునూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బస్వరాజు రాములు, పి.ఏ.సి.ఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల రవి, నాయకుడు వర్దోలు సంతోష్ యాదవ్ మీడియాతో మాట్లాడారు.గ్రామంలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, చెరువులు మరియు పంట పొలాలకు నేరుగా సాగునీటి కాలువలు లేక ప్రతి సంవత్సరం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలువల లేమితో వందలాది ఎకరాలు సాగుకు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ చెరువులకు నేరుగా కాలువలు నిర్మించడంతో పాటు, పంట పొలాలకు నీరు చేరేలా క్షేత్ర స్థాయి కాలువలు ఏర్పాటు చేయాలని, అధికారులు గ్రామాన్ని సందర్శించి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరారు. ప్రభుత్వం రైతుల పక్షాన పని చేస్తున్నందున సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో శ్రీకాంత్,బాలయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వాసవి మాత జయంతి వేడుకలు



**మహబూబ్ నగర్, ఏప్రిల్ 26(వుదయం ప్రతినిధి):**
రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.వాసవీ మాత చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పూల మాలలు సమర్పించారు.త్యాగ నిరతి,ధర్మ నిష్ఠ,సమాజ హిత భావనకు ప్రతిరూపమైన ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమం లో రెవెన్యూ అధనపు కలెక్టర్ జె.ఎల్. బి హరిప్రియ,డి.ఆర్. ఓ రాం రెడ్డి,డి.పి.ఆర్. ఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ సువర్ణ రాజ్,ఆర్య వైశ్య నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వైర్లు చోరీ

- **కాపర్ వైర్లు ఎత్తుకెళ్లిన దొంగలు**
- **గద్వాల జిల్లాలో రైతులకు తీవ్ర దెబ్బ**

**అలంపూర్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి):**
జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ మండలం పులికల్ గ్రామ పరిధిలో రైతుల పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫారంలో గుర్తుతెలియని దుండగులు కాపర్ వైర్లను దొంగిలించారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి సమయంలో జరిగినట్లు స్థానికులు తెలిపారు.రైతుల వివరాల ప్రకారం, ముందుగా ట్రాన్స్ఫారంలో ఉన్న ఆయిల్ను పూర్తిగా బయటకు తీసిన దొంగలు, అనంతరం లోపల ఉన్న కాపర్ వైన్డింగ్ వైర్లను తొలగించి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం మోటార్లు ఆన్ చేయడానికి వచ్చిన రైతులు ట్రాన్స్ఫారం దెబ్బతిన్న స్థితిలో ఉండటాన్ని గమనించి దిగ్భ్రాంతికి గురయ్యారు.ఈ ఘటనతో రైతుల వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నీటి సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఈ దొంగతనం రైతులకు మరింత నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.ఇటీవల ట్రాన్స్ఫారాల్లో కాపర్ వైర్లు దొంగిలించే ఘటనలు పెరుగుతున్నాయని, ప్రత్యేకంగా గుంపులుగా తిరుగుతూ ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే వెంటనే గమనించాలని రైతులు కోరుతున్నారు.గ్రామస్థులు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించా



లని సూచించారు. అలాగే, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ఫారాన్ని మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దుండగులను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## నేటి నుండే జనాభా లెక్కల 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'

- **మే 10 వరకు ఆన్లైన్ లో వివరాల నమోదుకు అవకాశం:**
- **జిల్లా కలెక్టర్ కె. హేమావతి**

**సిద్దిపేట, ఏప్రిల్ 26 వుదయం ప్రతినిధి):**
2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా జిల్లా ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' ప్రక్రియ ఆదివారం నుండి ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ కె. హేమావతి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్ వేర్ ద్వారా మే 10వ తేదీ వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.పౌరులు తమ మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా ఆన్లైన్ లో వివరాలను నమోదు చేసుకోవచ్చు. అధికారిక పోర్టల్: ప్రజలు http://se.senses.gov.in వెబ్ సైట్ లోకి లాగిన్ అవ్వాలి. మొత్తం 9 స్టెప్స్ లో ఈ నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. సాఫ్ట్ వేర్ అడిగే 33 ప్రశ్నలకు ఖచ్చితమైన సమాధానాలను నమోదు చేయాల్సి ఉంటుంది.వివరాల నమోదు పూర్తయిన తర్వాత సాఫ్ట్ వేర్ ఒక SE ID (SelfEnumeration ID ని కేటాయిస్తుంది. "ప్రజలు తమ SE IDని స్క్రీన్ షాట్ తీసుకోవాలి లేదా భద్రపరుచుకోవాలి. తదుపరి దశలో జనాభా లెక్కల అధికారులు మీ ఇంటికి వచ్చినప్పుడు ఈ ఐడిని చూపిస్తే, వారు మీ వివరాలను సిస్టమ్ లో నేరుగా ఆమోదిస్తారు" అని కలెక్టర్ వివరించారు.
జిల్లాలోని ప్రజలందరూ ఈ డిజిటల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువులోగా తమ కుటుంబ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ హేమావతి కోరారు.

## ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి మాద్రి పృధ్వీరాజ్ రూ. లక్ష విరాళం

**సంగారెడ్డి, వుదయం :**
పటాన్చెరు నియోజకవర్గంలోని జేపీ కాలనీ డివిజన్ పరిధిలో సాయి గణేష్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయ స్థిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కోఫౌండర్ శ్రీ మాద్రి పృధ్వీ రాజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పృధ్వీరాజ్ గారి సేవాభావాన్ని అభినందించారు.ఈ సందర్భంగా మాద్రి పృధ్వీరాజ్ మాట్లాడుతూ, దేవాలయాలు సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికత మరియు సాంస్కృతిక విలువలను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. స్థానిక ప్రజలందరూ కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని



పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు సంతోష్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్, నరేష్, సంతోష్ తో పాటు కాలనీ పెద్దలు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెల్ఫ్ ఎన్యుమరేషన్ విజయవంతం



**నంగునూరు, ఏప్రిల్ 26 వుదయం:**
సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక మార్కెట్ కమిటీ చైర్మన్, 25 గ్రామ పంచాయతీ సర్పంచులు, 5 ఉప సర్పంచులు తమ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి ఒక్కరూ స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా ప్రభుత్వ పథకాల అమలు మరింత పారదర్శకంగా జరుగుతుందని, ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు.మండలంలోని మిగతా ప్రజలు కూడా త్వరితగతిన తమ సెల్ఫ్ ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని అధికార యంత్రాంగం కోరుతోంది.

## ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం

**వెల్దండ 26, (వు దయం) :**
మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి ఆరాధన మహోత్సవాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు భూపతి రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు కృష్ణారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అన్నదానం కృష్ణయ్య, పురుషోత్తం చారి, పాండు చారి, జగన్ చారి, రామకృష్ణ చారి, శివ, తోపాటు పలువురు నాయకులు భక్తులు పాల్గొన్నారు



# అంబేద్కర్ గారి విగ్రహావిష్కరణ మహోత్సవం

వుదయం
న్యాల్కల్.ఏప్రిల్ :26



సంగారెడ్డి జిల్లా,న్యాల్కల్ మండలం, రాంతీర్థ్ గ్రామం లో ఈ రోజు భారత రత్న, డా. బి. ఆర్.అంబేద్కర్ గారి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా, మినిస్టర్. వివేక్ వెంకటస్వామి, గారు &MP. సురేష్ శెట్కార్ గారు హాజరు అయ్యారు.వారి చేతుల మీదుగా అంబేద్కర్ గారికి పూజ కార్యక్రమం చేసి విగ్రహావిష్కరణ చేసారు, అంబేద్కర్ మన రాజ్యాంగ నిర్మాత, అయన అడుగు జాడల్లో నడవాలి, ఆయన ఆశయాలు సాధించాలని యువత కు చెప్పడం జరిగింది,ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి వర్యులు.చంద్రశేఖర్ గారు,గిరిధర్ రెడ్డి గారు తన్విర్ గారు, చంద్రప్ప పటేల్. గారు &భాస్కర్ రెడ్డి,అలిండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు:దుర్గ ప్రసాద్ గారు, మరియుబి.జి సందీప్ గారు&BSP జిల్లా అధ్యక్షులు:పీపడ్ పల్లి మోహన్ గారు, నర్సింలు సార్, &మండల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి గారు. కార్యకర్తలు &అంబేద్కర్ యువజన సంఘాలు,వివిధ గ్రామప్రజలు, తది తరులు,పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసారు.ఈ కార్యక్రమం లో రాంతీర్థ్ గ్రామ సర్పంచ్ :శ్రీనివాస్ రెడ్డి గారు, మాట్లాడుతూ మా గ్రామం లో మా సమక్షంలో అంబెడ్కర్ గారి విగ్రహావిష్కరణ జరగడం చాలా ఆనందంగా, ఉంది, నా అదృష్టం గా భావిస్తున్నాను అని మాట్లాడటం జరిగింది. గ్రామ సర్పంచ్ &అంబెద్కర్ యువజన సంఘం&కార్యకర్తలు వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది.

# బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం



నంగునూరు, ఏప్రిల్ 26: వుదయం

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో ఇటీవల ఆకలితో అలమటిస్తూ అనారోగ్యంతో మరణించిన గౌడుగు యాదవ్వ కుటుంబానికి పీఆర్ ముదిరాజ్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెసరు రాజు అండగా నిలిచారు. యాదవ్వ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు.స్థానిక ముదిరాజ్ సంఘం సభ్యులు సాంబయ్య, గౌర బోయిన స్వామి ముదిరాజ్ సమక్షంలో యాదవ్వ కుటుంబ సభ్యులకు ఆదివారం ఈ డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా యాదవ్వ మృతికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకుడు పులి సదానందం ముదిరాజ్, సింగారపు రామకృష్ణ ముదిరాజ్, అమ్మగారి శ్యామ్ కుమార్, ప్రహ్లాద రావు, లోకేశ్, చిరంజీవి, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళు ఆలస్యం

- రైతులకు తప్పని తిప్పలు

నంగునూరు, ఏప్రిల్ 26: వుదయం



ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, బీజేపీ నంగునూరు మండల ఉపాధ్యక్షుడు కత్తుల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం వారు సిద్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద విలేఖరులతో మాట్లాడుతూ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ కొనుగోలు ఆలస్యం అవుతోందని పేర్కొన్నారు. దీనివల్ల రోజుల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు పడుతున్నారని వాపోయారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో రైతులు ఎండ దెబ్బకు గురై అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. దీనికి తోడు వాతావరణ పరిస్థితులు మారి అకస్మాత్తుగా కురిసే ఆకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో నాణ్యమైన గన్ని సంచులు అందించడంతో పాటు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు సరిపడా టార్పాలిన్ కవర్లను ప్రభుత్వమే ఉచితంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు కనీసం మూడు వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

నంగునూరు ,ఏప్రిల్ 26 వుదయం:

మండలంలోని అన్ని గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలిపారు. ఆదివారం బద్దిపడగా గ్రామంలో పాలమకుల PACS ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. సన్న రకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తప్పేట శంకర్, గ్రామ సర్పంచ్ మంద లక్ష్మి రాజు, PACS కార్యదర్శి రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాగు శ్రీకాంత్ యాదవ్, ఉపసర్పంచ్ రేపాక రాజేందర్, పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పవన్, డైరెక్టర్లు తిపని రాజేశ్వర్, గాండ్ల రమేష్, ఐలయ్య, రంగు అశోక్ గౌడ్, రంగారెడ్డి, జీవన్ నాయక్, ఆవుల నాగరాజు, కైతి రమేష్, సమ్మి బాబు, తిరుపతి, రాజశేఖర్ రెడ్డి, లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మయుద్ధానికి శంఖారావం

- కవితమ్మ పిలుపుతో తెలంగాణ రాష్ట్ర సేనకు నూతన దిశ

సంగారెడ్డి, వుదయం :



సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సేన (TRS) పార్టీ ప్రజల్లో చైతన్యం నింపే దిశగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర జాగృతి కార్యదర్శి ఇ. మురళీ కృష్ణ పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావం అనంతరం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ అజెండాను తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన "పంచజన్యం" ప్రాముఖ్యతను వివరిస్తూ, మహాభారతంలో శ్రీకృష్ణుడు ఊదిన శంఖం ధర్మయుద్ధానికి నాంది పలికినట్లే, నేటి సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాటానికి కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రఖ్యాత నాయకురాలు కవితమ్మ ధర్మయుద్ధానికి శంఖారావం పూరించారని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బలమైన పిలుపునిచ్చారని పేర్కొన్నారు. ఆమె నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సేన ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఇ. మురళీ కృష్ణ ప్రస్తావించిన ముఖ్యాంశాలు:తెలంగాణ రాష్ట్ర సేన ప్రజల ఆశయాల ప్రతిరూపం జాగృతి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపుసంగారెడ్డి జిల్లా సమగ్ర అభివృద్ధి అవసరంయువత, కార్యకర్తల కీలక పాత్రఐక్యతతో ముందుకు సాగాల్సిన సమయంఅలాగే, తెలంగాణ రాష్ట్ర సేన అనే పేరు కేవలం ఒక పార్టీ పేరు మాత్రమే కాదని, అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ఉద్యమ స్ఫూర్తి, త్యాగాల ప్రతీక అని అన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, తెలంగాణ భావజాలాన్ని నిలబెట్టే సంకల్పంతో ఈ పేరును నిర్ణయించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మద్ది శ్రీనివాస్ రెడ్డి, చంద్రిక కరుణాకర్, నాల్ల కృష్ణమోహన్, సారా నితిన్ కుమార్, కళ్యం సాయికాంత్ గౌడ్, తంగడిపల్లి నర్సింహులు తదితరులు పాల్గొని పార్టీ బలోపేతానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.చివరగా, పాంచజన్యం శంఖారావంలా ప్రతి కార్యకర్త ధర్మం, న్యాయం, సమాజ అభివృద్ధి కోసం కలిసి కట్టుగా ముందుకు రావాలని ఇ. మురళీ కృష్ణ పిలుపునిచ్చారు.

# స్వీయ గణనను ప్రారంభించిన ప్రభుత్వ విప్

మహబూబ్ నగర్, ఏప్రిల్ 26(వుదయం ప్రతినిధి):




జిల్లాలో జనాభా గణన 2027 లో బాగంగా మొదటి దశ హౌస్ లిస్టింగ్ కార్యక్రమం లో భాగంగా స్వీయ గణన జిల్లాలో ఆదివారం ప్రారంభం అయ్యింది.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, జిల్లా స్పోర్ట్స్ స్టేడియం కమాన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తో కలిసి జనాభా గణన 2027 భాగమైన మొదటి దశ సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమాన్ని లాంఛనంగా వారు ప్రారంభించారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్వీయ గణన లో బాగంగా టాబ్ ద్వారా వివరాలను సెన్సస్ పోర్టల్ లో నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో ప్రజల నుద్దేశించి ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2011 సంవత్సరం తర్వాతతర్వాత 2021లో నిర్వహించాల్సిన జనాభా గణన కరోనా కారణంగా నిలిచిపోయిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సెన్సస్2027ను ప్రారంభించాయని తెలిపారు. మొదటిసారిగా జనాభా గణన డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని చెప్పారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరుగుతున్న మొదటి దశ స్వీయ గణన ప్రక్రియలో ప్రజలు 100 శాతం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు సెన్సస్ పోర్టల్ లో కంప్యూటర్, మొబైల్,టాబ్ ద్వారా తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరూ స్వీయ గణన లో పాల్గొని, తప్పులేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు.
మహబూబ్‌నగర్ పట్టణంలో గత దశాబ్ద కాలంలో జనాభా గణనీయంగా పెరిగిందని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుండి వలసలు రావడంతో పట్టణ జనాభా సుమారు 3.50 లక్షలకు చేరిందని అంచనా ఉందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పార్కులు వంటి మౌలిక వసతులు కల్పించాలంటే ఖచ్చితమైన జనాభా గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. దీనివల్ల సరైన ప్రణాళికలు రూపొందించి నిధులను సమకూర్చుకోవచ్చని అన్నారు.
జనాభా గణన సేకరించిన డేటా తో ప్రతి వర్గానికి తగిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం సులభమవుతుందని అన్నారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ హ్యాపీ సండే కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సెన్సస్2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజలు సెన్సస్ పోర్టల్ ,వెబ్ సైట్ లో తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. 2011 తర్వాత మళ్లీ ప్రభుత్వం జనాభా గణన ప్రారంభించిందని పేర్కొన్నారు.
జనాభా గణన 2027 ప్రక్రియను ప్రధానంగా రెండు దశల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు మొదటి దశలో ఇళ్ల జాబితా తయారీ (హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్) ప్రక్రియ 1 ఏప్రిల్ 2026 నుండి 30 సెప్టెంబర్ 2026 వరకు జరుగుతుందని తెలిపారు.రెండవ దశ అసలైన జనాభా గణన ఫిబ్రవరి 2027లో దేశవ్యాప్తంగా ఏక కాలంలో జరుగుతుందని ఆమె తెలిపారు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ అనేది రాష్ట్రంలో జనగణన ప్రారంభం కావడానికి సరిగ్గా 15 రోజులు ముందు నుంచి ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు
స్వీయ గణనలో భాగంగా పౌరులు సెన్సస్ పోర్టల్‌లో ఉన్న 33 ప్రశ్నలకు వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.స్వీయ గణన గురించి యువత,విద్యార్థులు అందరికీ అవగాహన కలిగించాలని అన్నారు ఈ డేటా ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. మొదటి సారిగా ఈ ప్రక్రియ డిజిటల్ రూపంలో జరుగుతోందని అన్నారు.
ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ఎప్పుడైనా వివరాలను నమోదు చేయవచ్చని తెలిపారు. స్వయంగా నమోదు చేయడం వల్ల తప్పులు తగ్గుతాయని,సమయం ఆదా అవుతుందని చెప్పారు. నమోదు అనంతరం ఐ.డి. జనరేట్ అవుతుందని, దానిని స్క్రీన్‌షాట్ తీసుకుని భద్రపరచుకోవాలని సూచించారు. ఎన్యూమరేటర్ వచ్చినప్పుడు ఆ ఐ.డి.ని చూపిస్తే జనాభా గణన ప్రక్రియ సులభంగా వేగవంతమవుతుందని చెప్పారు. మహబూబ్‌నగర్ ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.ప్రజలకు అవగాహన కలిగించేందుకు స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రదర్శించి స్వీయ గణన ప్రక్రియ లో తమ కుటుంబ వివరాలను ఏ విధంగా నమోదు చేసుకోవాలని స్టెప్ ల వారిగా వివరించారు.
ట్రైనర్లు శ్రీకాంత్, బాలు యాదవ్ స్వీయ గణన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.హ్యాపీ సండే కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు
మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా ప్రతి ఆదివారం నిర్వహించే హ్యాపీ సండే కార్యక్రమంలో చిన్నా8, మ్యాజిక్ షోలు, ఆటపాటలతో ప్రజలను అలరించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, పట్టణ మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు,సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

# మిరుదొడ్డిలో సాగునీటి గోస





- అడుగట్టిపోతున్న బోర్లు, ఎండిపోతున్న పంటలు

దుబ్బాక వుదయం (ఏప్రిల్ 24) :

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలో రైతన్నలు సాగునీటి కష్టాలతో సతమతమవుతున్నారు. తీవ్ర ఎండలకు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు నీరందక వెలవెలబోతున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతుల్లో ఆందోళన మొదలైంది. మిరుదొడ్డి మండల వ్యాప్తంగా గత నెల రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. దీని ప్రభావం నేరుగా వ్యవసాయంపై పడింది. మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయి అడుగంటాయి. పంట పొలాలకు నీళ్లు పెట్టేందుకు రైతులు వేసిన బోర్లు సైతం నీళ్లు లేక విఫలమవుతున్నాయి.వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు సాగునీరు అందక వాడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక్క పంట చేతికి అందుతుందో లేదో అనే భయం వెంటాడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు పశువులకు సైతం తాగునీరు కరువైంది.
ఈ నేపథ్యంలో మిరుదొడ్డి మండల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్న సాగర్ కాలువల ద్వారా తమ మండలంలోని చెరువులను నింపాలని డిమాండ్ చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన కాలువ పనులు పూర్తి చేసి నీళ్లు విడుదల చేస్తేనే తమకు ఉపశమనం లభిస్తుందని రైతులు కోరుతున్నారు.

# గజ్వేల్‌లో ఘనంగా వాసవీ మాత జయంతి ఉత్సవాలు

- 108 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం..
- భక్తిశ్రద్ధలతో గోపూజ, కుంకుమార్చన

గజ్వేల్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి):



సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్య సంఘం మరియు మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.జయంతిని పురస్కరించుకొని ఆలయంలో తెల్లవారుజాము నుండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 108 కలశాలతో అమ్మవారికి విశేష జలాభిషేకం, పంచామృత అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపూజ, సామూహిక వాసవి పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు భారీ స్థాయిలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. అహింసా మార్గం ఆదర్శనీయం:ఈ సందర్ముభంగా మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ప్రముఖ నాయకులు సిద్ది బిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, గోలి సంతోష్, జగ్గయ్య శేఖర్ మాట్లాడుతూ.. వాసవీ మాత చూపిన అహింస, ధర్మరక్షణ మరియు త్యాగ నిరతి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు. సమాజ సేవలో వైశ్యులు ఎల్లప్పుడూ ముందుండాలని, అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు .ఈ వేడుకల్లో ఉప్పల మెట్టయ్య, ఎర్రం శ్రీనివాస్, కొమరవెల్లి శంకరయ్య, ఎన్.సి. సంతోష్, సూర ఆంజనేయులు, గంగిశెట్టి వెంకటేశం, భద్రయ్య, కాశీనాథ్, రాజేశం, కైలాస ప్రశాంత్, ఉమేష్, రమేష్‌లతో పాటు వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు మరియు చిన్నారులు పాల్గొన్నారు.



# ఘనంగా జిల్లా నేత భూపతి రెడ్డి జన్మదిన వేడుకలు

- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి

వెల్దండ, ఏప్రిల్ 26 (వు దయం) :

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వై భూపతి రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం మండల కేంద్రంలో ఆయన నివాసంలో మరియు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లు పాల్గొని భూపతి రెడ్డి చేత కేక్ కట్ చేయించి తినిపించి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కృష్ణారెడ్డి , జిల్లా పార్టీ కార్యదర్శి మోతిలాల్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్, పర్వత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తోపాటు పలువురు నాయకులు అభిమానులు పాల్గొన్నారు



# ఎమ్మెల్యే హరీష్ రావుకు 'ఎల్లమ్మ' ఉత్సవాల ఆహ్వానం

- ఆహ్వాన పత్రికను అందజేసిన జగదేవపూర్ మండల సర్పంచ్‌లు

సిద్దిపేట/ జగదేవపూర్, ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి) :

సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును ఆదివారం జగదేవపూర్ మండల ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి, జగదేవపూర్ ఎల్లమ్మ దేవాలయం పదవ వార్షికోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జగదేవపూర్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ, ఆలయ 10 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు మరియు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని హరీష్ రావును కోరారు. జగదేవపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు. ఆహ్వాన పత్రికను స్వీకరించిన హరీష్ రావు, ఆలయ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరుతూ పౌరులకు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వుదయం సినిమా

MOVIE TIME!

## 27న గోదారి గట్టుపైన ట్రైలర్



**వుదయం సినిమా :** యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన' తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే టీజర్, సాంగ్స్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమా మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ రోజు మేకర్స్ ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. 'గోదారి గట్టుపైన' ట్రైలర్ ఏప్రిల్ 27న లాంచ్ చేయనున్నారు. ట్రైలర్ అనౌన్స్మెంట్ పోస్టర్ లో సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ క్యూట్ రొమాంటిక్ వైబ్ తో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది.

## తలైవార్ 173

### నటుడిగా శంకర్‌కు ఆఫర్?



**వుదయం సినిమా :** సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం సిబి చక్రవర్తి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ మూవీకి టైటిల్ ఫిక్స్ చేయకపోవడంతో 'తలైవార్ 173' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమాను ప్రారంభించారు. లోకనాయకుడు కమల్ హాసన్ ఈ చిత్రాన్ని రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో సాయి పల్లవి ఓ కీలకమైన పాత్రలో కనిపించబోతోంది. ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ కోలీవుడ్ సర్కిల్లో చక్కర్లు కొడుతోంది. తన దర్శకత్వ ప్రతిభతో ఎన్నో విజయాలను అందుకొని ఇండియాలోనే టాప్ దర్శకులలో ఒకరిగా పేరుగాంచిన శంకర్‌ను ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం సిబి చక్రవర్తి సంప్రదించినట్లు, ఆయనతో ప్రస్తుతం చర్చలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. అన్ని ఓకే అయితే ఈ సినిమాలో కీలకమైన పాత్రలో శంకర్ కనిపించే అవకాశాలు ఉన్నట్లు ఓ వార్త వైరల్ అవుతోంది. ఒకవేళ నిజంగానే ఇందులో శంకర్ భాగం అయితే ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## రావు బహదూర్

### జూన్ 5న రిలీజ్



**వుదయం సినిమా :** సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. 'రావు బహదూర్' జూన్ 5న థియేటర్లలోకి రానుందని అఫీషియల్ గా ప్రకటించారు. అకడమిక్ సీజన్ ప్రారంభానికి ముందు ఈ రిలీజ్ ప్లాన్ చేయడం మంచి స్ట్రాటజిక్‌గా కనిపిస్తోంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సత్యదేవ్ రాయల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో, అధికారం, రహస్యభావం కలిసిన లుక్‌తో ఆయన ప్రెజెన్స్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఆయన పాగాలో కనిపించే చిన్న పురుగు ఒక సింబాలిక్ అంశంగా కనిపిస్తూ కథలోని లోతైన అర్థాలను సూచిస్తోంది. తీగలతో కప్పబడ్డ భారీ కోట బ్యాక్‌డ్రాప్ సినిమా మరింత క్యురియాసిటీని పెంచింది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన రాగా, ఫస్ట్ సింగిల్ 'ఓ సుందరి' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. సత్యదేవ్, దీప థామస్‌లపై చిత్రీకరించిన ఈ మెలోడీ ఒక వింటేజ్ ప్రేమను అందంగా ప్రతిబింబిస్తూ, పీరియడ్ ఫీల్‌ను అద్భుతంగా చూపించింది.

## మకుటంలో అంజలి



**వుదయం సినిమా :** సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో 99వ సినిమాగా ఆర్.బి. చౌదరి నిర్మాణంలో విశాల్ స్వీయ దర్శకత్వంలో రానున్న చిత్రం 'మకుటం'. ఇప్పటి వరకు వచ్చిన కంటెంట్, పోస్టర్లు చూస్తే ఇదొక డిఫరెంట్ యాక్షన్ సినిమా అని అర్థం అవుతోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన మరో అప్డేట్ ఇచ్చారు. విశాల్, అంజలి కాంబోకి ఉన్న హిట్స్, క్రేజ్ అందరికీ తెలిసిందే. అయితే ఈ 'మకుటం' చిత్రంలోనూ విశాల్ సరసన అంజలి నటించనున్నారు. ఈ మేరకు అంజలి, విశాల్ కలిసి ఓ కాన్సెప్ట్ వీడియోని చేశారు. హీరోయిన్ అంజలి వద్దకు దర్శకుడైన విశాల్ కథ చెప్పడానికి వెళ్తాడు. ఇక కథ చెప్పండి డైరెక్టర్ గారు అని అంజలి అంటారు. ఒక అందమైన గ్రామం అని విశాల్ అంటే.. అది ప్రొడక్షన్ వాళ్లు చూసుకుంటారు కదా.. ముందు మీరు కథ చెప్పండని కౌంటర్ వేస్తారు అంజలి. ఇలా విశాల్ కథ చెబుతూ ఉంటే మధ్య మధ్యలో అంజలి సెటైర్లు వేస్తుంటారు. విశాల్ ఇలా ఏదేదో చెబుతుంటారు.. అసలు మీ వద్ద కథ ఉందా? అని అంజలి అడగడంతో విశాల్ పారిపోతారు. మంచి కథ అని మేనేజర్ చెప్పారే.. విశాల్ ఏంటి ఇలా చెబుతున్నారని అంజలి అనుకుంటారు. కథ అడుగుతోందే.. ఎలా.. రేపు వచ్చి మరో కథ చెబుదాం అని విశాల్ వెళ్లిపోతారు. ఈ కాన్సెప్ట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఈ మూవీకి జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. స్క్రీన్ ప్లే, డైరెక్షన్ బాధ్యతల్ని విశాల్ చూసుకుంటున్నారు. ఈ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

## మా ఇంటి బంగారం

### తస్సాదియ్యా సాంగ్..



**వుదయం సినిమా :** ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న సెకండ్ ప్రాజెక్ట్ 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం మే 15న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ అవుతోంది. ఈ వేసవిలో రిలీజవుతోన్న చి త్రా ల్లో ఈ యాక్షన్ డ్రామా కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రీసెంట్‌గా విడుదలైన టీజర్‌తో సినిమాపై చాలా మంచి హైప్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ముందుగా మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రీసెంట్‌గా 'తస్సాదియ్యా' అనే సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ సోషల్ మీడియాలో సెన్సేషనల్‌గా మారింది. నెట్టింట ఎక్కడ చూసినా వైరల్ అవుతోంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 20 వేలకు పైగా రీల్స్‌లో ఈ సాంగ్ ట్రెండ్ అవుతోంది. అలాగే యూ ట్యూబ్, షార్ట్ వీడియోస్‌లోనూ సాంగ్ అందరినీ అలరిస్తూ సాంగ్ ట్రెండ్ అవుతూ టాప్ రేంజ్‌లో దూసుకెళ్తోంది. ఈ సెలబ్రేషన్ సాంగ్‌ను పర్ఫెక్ట్ గా సంతోష్ నారాయణన్ కంపోజ్ చేశ్యారు. సాంగ్ బీట్, లిరిక్స్, కొరియోగ్రఫీ అన్నీ పక్కాగా కుదిరాయి. అందుకనే సాంగ్‌ను చూస్తున్నంత సేపు ఫెస్టివల్ ఫీల్ కలుగుతోంది. దీంతో సాంగ్‌కు ఆడియెన్స్ నుంచి సెన్సేషనల్ రెస్పాన్స్ వస్తోంది. దీంతో సినిమాపై హైప్ క్రియేట్ అయ్యింది. ఇప్పుడు టీమ్ కొత్త ప్రమోషనల్ స్ట్రాటజీతో సినిమాపై అంచనాలను పెంచటానికి సిద్ధమవుతోంది. రీసెంట్‌గా చిత్ర యూనిట్ సమంతను వెన్నెల కిషోర్ విడుదల చేసిన వీడియోకు సంబంధించిన క్లిప్స్ వైరల్ అవుతున్నాయి. దీంతో "మా ఇంటి బంగారం" మూవీపై మంచి హైప్ క్రియేట్ అవుతోంది. ఎమోషనల్ టచ్‌తో పాటు ఫ్యామిలీ సెంటిమెంట్‌ని, రోమాలు నిక్కబొడుచుకునేలా ఉండే యాక్షన్ సీన్స్ కలగలిసి గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది.

## మల్లాపూర్‌లో హెయిర్ స్టైలిస్ట్ జావేద్ హబిబ్స్ సందడి





**వుదయం సినిమా :** జావేద్ హబిబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ ఫ్యామిలీ సలొన్ ని సికింద్రాబాద్ లోని మల్లాపూర్ లో ప్రారంభించింది. ఈ సలోన్ ను భారతదేశంలోని హెయిర్ కట్టింగ్ లో లెజండ్ గా గుర్తింపు పొందిన జావేద్ హబీబ్ మరియు ఎం.ఎల్.ఏ మరియు గవర్నమెంట్ వియ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. భారత్ దేశంలో 29రాష్ట్రంలలో 130 సిటీస్ పైగా సలోన్స్ ఉన్నాయి ఈరోజు 102 సలోన్ ని తెలంగాణ లోని మల్లాపూర్ లో ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల మాస్టర్ ఫ్రాంచైజ్ నిర్మాహకులు తేజ దేవిశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఫ్రాంచైజ్ నిర్వహకులు భాగ్యవతి మరియు మల్లేషం పాల్గొన్నారు. ఈ సందర్బంగా సలోన్ నిర్వహకులు భాగ్యవతి మరియు మల్లేషం మాట్లడుతూ మేం ఈ సలొన్ ని కేవలం ప్రజలు కనిపించే విధానం లో మార్పు తెసుకురావటానికి మాత్రమే కాదు జీవితం పట్ల వారి దృక్పథం లో కూడా మేం మార్పులు తీసుకరానున్నం...! మా కస్టమర్లు అంతర్గతంగా కూడా అందాన్ని అనుభవించాలని కోరుకుంటున్నాం. జావేద్ హబిబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ ఫ్యామిలీ సలొన్ ప్రతెక్యమేన గ్రూమింగ్ సేవలని సెలెబ్రిటిలు మరియు స్టార్ లకి సర్వం సిద్ధం చేయటంతో పాటుగా చిక్ మరియు ట్రెండ్ హెయిర్ కేర్, స్కిన్, బాడీ కేర్ సేవలని విస్తరించిది. వీటిలో హెయిర్ కలరింగ్, గ్రూమింగ్ సేవలు అయినటువంటి హెయిర్ స్టైలింగ్, మానిక్యూర్, మేకప్, హెయిర్ గ్రూమింగ్ ఉన్నాయి అని తెలిపారు.



## కామాఖ్య ఫస్ట్ లుక్ రిలీజ్

**వుదయం సినిమా :** సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, ఫస్ట్ సింగిల్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

తాజాగా మేకర్స్ సముద్రఖని ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ 'తిరుపతి'గా ఆయన పాత్రను పరిచయం చేశారు. ఆయన ప్రెజెన్స్ చాలా ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంది. ఈ చిత్రంలో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని ఫస్ట్ లుక్ సూచిస్తోంది.



## శృతి జాక్‌పాట్

**వుదయం సినిమా :** రామ్ చరణ్ బుచ్చిబాబు సనా కాంబోలో వస్తోన్న మోస్ట్ అవైటేడ్ మూవీ పెద్ది. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ చిత్రం కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడడంతో అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ఓ ఐటమ్ సాంగ్ మినహా ఈ మూవీ షూట్ మొత్తం దాదాపు పూర్తయింది. పెద్ది ఐటమ్ సాంగ్ కోసం పలువురు హీరోయిన్స్‌ను పరిశీలించగా.. చివరికీ కోలీవుడ్ భామ శృతిహాసన్ పేరు ఖరారు చేశారు. ప్రస్తుతం ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోనే షూట్ చేస్తున్నారు. ఇవాళ ఈ సాంగ్ షూటింగ్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో శృతిహాసన్ రెమ్యునరేషన్‌పై టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ ఐటమ్ సాంగ్ కోసం దాదాపు రూ.3 కోట్ల వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే ఈ కోలీవుడ్ బ్యూటీ జాక్‌పాట్ కొట్టేసినట్లే. కాగా.. ఈ పాటను టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కంపోజ్ చేస్తున్నారు. ఈ స్పెషల్ సాంగ్‌ను ఏప్రిల్ 30వ తేదీ నాటికి పూర్తిచేయనున్నట్లు తెలుస్తోంది.

## మేకింగ్ ఆఫ్ విశ్వ గ్లిమ్స్ విడుదల



**వుదయం సినిమా :** మురళీ మోహన్, అనన్య నాగల్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం "ది బ్రేకింగ్ న్యూస్". ఈ చిత్రానికి పవన్ కడియాల దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల చిరంజీవి చేతుల మీదుగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ విడుదలైంది. ఇప్పుడు చిత్రబృందం నుంచి మరో ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను విడుదల చేశారు. మురళీ మోహన్ గారి పాత్రను ఎంతో గంభీరంగా, ఆవేశ భరితంగా చూపించే మేకింగ్ గ్లింప్స్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. "మేకింగ్ ఆఫ్ విశ్వ" అనే టైటిల్‌తో ఈ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రం 2026 మే నెలలో విడుదలకు సిద్ధమవుతోంది. ఓపెన్ స్కై క్రియేషన్స్ బ్యానర్‌పై హనుమంత్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## ది కేరళ స్టోరీ 2 ఓటీటీ రిలీజ్ డేట్‌లో మార్పు



**వుదయం సినిమా :** 'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ఈ చిత్రం మే 8 నుంచి తమ ప్లాట్‌ఫామ్‌పై స్ట్రీమింగ్ అవుతుందని ప్రకటించిన 'జీ 5' సంస్థ.. రిలీజ్ డేట్‌ను మార్చింది. మే 1 నుంచే తెలుగు ఆడియోలోనూ అందుబాటులో ఉంటుందని తెలిపింది. 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందిన 'ది కేరళ స్టోరీ 2' కూడా వివాదాల నడుమ థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. ఉల్కా గుప్త, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో కామాఖ్యా నారాయణ్ సింగ్ తెరకెక్కించారు. ఈ సినిమా కథేంటంటే?: స్వతంత్ర భావాలు కలిగిన నేటితరం అమ్మాయిలు సురేఖ (ఉల్కా గుప్త), దివ్య (అదితి), నేహా (ఐశ్వర్య). కేరళకు చెందిన సురేఖ యూపీఎస్సీకి సిద్ధమవుతూ ఉంటుంది. జర్నలిస్ట్ సలీమ్ (సుమిత్ గహ్లోవత్) తో ఏర్పడిన పరిచయం లివింగ్ ఇన్ రిలేషన్‌కు దారితీస్తుంది. దివ్యకు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణించాలని కోరిక. లైక్‌లు, షేర్‌ల కోసం ఆమె చేసే నృత్యాలను తల్లిదండ్రులు ప్రోత్సహించరు. అదే సమయంలో పరిచయమైన రషీద్ (యుక్తమ్) ఆమెను ప్రేమిస్తున్నానని చెబుతూ, జీవితంలో అన్ని విషయాల్లో అండగా ఉంటానంటూ భరోసా ఇస్తాడు. ఇక జావెలెన్ త్రో రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తూ.. జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతుంటుంది నేహా. ప్రేమ పేరుతో ఆమెను తనవైపు తిప్పుకొని, దిల్లీలో ప్రఖ్యాత శిక్షకుడితో ట్రైనింగ్ ఇప్పిస్తానని మాయమాటలు చెబుతాడు రాజు అలియాస్ ఫైజన్. ఇలా ముగ్గురు అమ్మాయిలు తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెట్టి ప్రేమించిన వారితో వెళ్లిన తర్వాత ఏం జరిగింది? రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక వాళ్లు తీసుకున్న నిర్ణయం ఏంటి? అన్నది ఈ సినిమా కథ.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.